# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 50 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 24 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :50 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 24 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## నేడు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

- ఒక్క రోజు ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు
- నేడు అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం. మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ పర్యటనలో - మిగతా 2లో

## రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి..

### ప్రభుత్వ విప్ బొండా ఉమ

- స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ
- 2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ
- 2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం

- మిగతా 2లో



# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు



## చంద్రబాబుపై జగన్ ఫైర్

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసిపి నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

- మిగతా 2లో

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు.



### ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్

## కీలక సమావేశం

- చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు
- రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల

- మిగతా 2లో

### 'వందేమాతరం'పై సుప్రీంకోర్టులో పిటిషన్..

## అది మతపరమైన యుద్ధ గీతమన్న మాజీ ఐఏఎస్!

- వందేమాతరం పూర్తి పాఠంపై సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇది ఆనందమఠ్ నవలలోని మతపరమైన యుద్ధ గీతమని ఆరోపణ
- కేంద్రం ఉత్తర్వులను రద్దు చేయాలని కోర్టుకు వినతి
- తొలి రెండు చరణాలనే జాతీయ గీతంగా గుర్తించాలని వాదన 2లో
- రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఈ ఉత్తర్వులు విఘాతమని ఆరోపణ





## ఏఐతో భారత్‌కు పెను ముప్పు

### మైక్రోసాఫ్ట్ ఏఐ నిపుణుడి హెచ్చరిక

- సైబర్ దాడుల్లో ప్రపంచంలో భారత్ ఏడో టార్గెట్ అని తెలిపిన నికోలస్ బట్స్
- ఆసియాలో అత్యధిక దాడులు ఎదుర్కొంటున్న మూడో దేశమని వెల్లడి
- ఏఐ సాయంతో చైనా నుంచి రాన్సమ్‌వేర్, గూఢచర్య దాడులు జరుగుతున్నాయని హెచ్చరిక

- మిగతా 2లో

## వెస్ట్‌బ్యాంక్‌ను మూసివేసేందుకు సిద్ధమవ్వండి

వెస్ట్‌బ్యాంక్ ప్రాంతం మొత్తాన్ని పూర్తి గా దిగ్బంధించేందుకు సిద్ధం కావాల ని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమి న్ నెతన్యాహు భద్రతా బలగాలను ఆదేశించారు. హెబ్రాన్ నగరాన్ని తక్షణమే చుట్టుముట్టాలని, వెస్ట్‌బ్యాంక్ అంతటా ఆంక్షలు విధించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- మిగతా 2లో





## మహిళా పోలీసుతో తోపులాట..

## కిందపడిన విడదల రజని..

- పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో విడదల రజని, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం
- తన మద్దతుదారుడిని ఇంట్లోకి రానీయకపోవడంపై పోలీసులను నిలదీసిన వైనం
- ఎస్ఐ అడ్డుకోవడంతో జరిగిన తోపులాటలో కిందపడిపోయిన విడదల రజని
- వైసీపీ అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు

- మిగతా 2లో



### మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం

## కర్ణాటక సీఎం డీకే శివకుమార్

- తనతో పాటు కేరళ సీఎం సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్‌కు యత్నించారని డీకే ఆరోపణ
- పారిశ్రామికవేత్త మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించడం అనుమానాలకు కారణమైందని వెల్లడి
- ఆ వ్యక్తి పేరును, స్టింగ్ ప్రయత్నానికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టని డీకే
- మంత్రులను ఇరికించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు వెల్లడి
- సిద్ధరామయ్యకు సంబంధించిన స్టింగ్ వీడియోలపై కర్ణాటకలో రాజకీయ వివాదం

- మిగతా 2లో

### మీ సైనికుల మృతదేహాలకు మేమే

## అంత్యక్రియలు చేశాం..

### ఐరాసలో పాక్‌కు భారత్ చురకలు

పెన్ పవర్ డెస్క్: అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా - మిగతా 2లో



పెన్ పవర్

శనివారం 24 అక్టోబర్ 2026

# రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి..

రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు.సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట

దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.

## ఎడిటర్ వ్యూ

## టీడీపీ వర్సెస్ వైసీపీ... ఎవరి ట్రాప్ లో ఎవరు ఇరుక్కున్నారు ?

నీవు నేర్పిన విద్యయే నీరాజాక్ష అని పురాణ పద్యం ఒకటి ఉంది. అలాగే రాజకీయాల్లో టిట్ ఫర్ టాట్ ఉంటుంది, రిటర్న్ గిఫ్ట్ లు ఉంటాయి. 2021లో ఏకగ్రీవాల పేరుతో వైసీపీ నాడు చేసినది నేడు అధికార టీడీపీ కూటమి చేస్తోంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. అదే సమయంలో ఆనాటి వైసీపీ రాజకీయం మీద ఏహ్య భావం ఏర్పడింది. మరి ఈనాటి తీరు మీద టీడీపీ కూటమి పైన అదే ఏహ్య భావం ఏర్పడాలని వైసీపీ ట్రాప్ వేసిందా అన్న చర్చ సాగుతోంది. ఆనాటికీ నేటికీ తేడా ఏంటి అంటే అప్పట్లో మునిసిపోల్స్ వరకే టీడీపీ పోటీ చేసి జెడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలను బహిష్కరించింది. దాంతో వైసీపీ పని మరింత సులువు అయింది అని అంటారు. అయితే ఇపుడు వైసీపీ ఆ పని చేయడం లేదు, పోటీలో ఉంటోంది. నామినేషన్ల దాకా తమ వారిని తీసుకుని వెళ్తోంది. ఎటూ నామినేషన్లు ఆమోదం పొందవని తెలుసు కాబట్టి టీడీపీ చేసే దాడులను బయటపెట్టాలన్నదే వైసీపీ వ్యూహంగా కనిపిస్తోంది.

**జగన్ చెప్పేది ఇదే :**

జగన్ అయిదేళ్ళు సీఎం గా చేశారు. తమ హయాంలో స్థానిక సంస్థలకు ఏమి జరిగిందో కూడా తెలుసు. ఇపుడు టీడీపీ కూటమి అధికారంలో ఉంది. నామినేషన్లు వేయడం అంత ఈజీ కాదని కూడా వైసీపీ పెద్దలకు తెలుసు. అయినా ఏకగ్రీవాలు వద్దు అని జగన్ ఆదేశించారు అంటే టీడీపీ వర్సెస్ వైసీపీగా నామినేషన్ కేంద్రాల వద్ద జరిగే ఘర్షణలు దాడులతో అధికార పార్టీ దౌర్జన్యం చేసింది అని బయట పెట్టడానికే అంటున్నారు. ఎన్నికలు బాయ్ కాట్ చేస్తే ఈ రకమైన సన్నివేశాలు కానీ కోర్టుల దాకా వెళ్ళి ఎస్ ఈసీని ఆదేశించిన విధంగా తీర్పులు కానీ రావు అన్నది తెలిసిందే. ఇవన్నీ వైసీపీ చేస్తోంది అంటే వైసీపీ టీడీపీని ట్రాప్ లోకి లాగిందా అన్నదే చర్చగా ఉంది.

**గెలుపు కాదన్నదే :**

ఇంత చేసి టీడీపీ కూటమి గెలిచినా అది గెలుపు కాదు అన్నది చాటి చెప్పడం కూడా వైసీపీ వ్యూహంగా కనిపిస్తుంది అని అంటున్నారు. అందుకే ఇవి ఎన్నికలేనా ఇలాగేనా నిర్వహించేది అని వైసీపీ పదే పదే ప్రశ్నిస్తోంది. నిజానికి ఈ ఎన్నికల్లో గెలుపు కంటే కూడా టీడీపీ విజయాన్ని తక్కువ చేసి చూపించడం, అలాగే ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని లోకానికి చాటడమే వైసీపీ వ్యూహమగా ఉంది అని అంటున్నారు. మామూలుగా ఎన్నికలు జరిగినా కూడా అధికార కూటమికే మొగ్గు ఉంటుంది. కాకపోతే కనీసం ఇరవై నుంచి ముప్పై శాతం అయినా వైసీపీకి సీట్లు వచ్చేవి. కానీ టీడీపీని వైసీపీ ముగ్గులోకి లాగిందా లేక గత అనుభవాలు టీడీపీకి జ్ఞప్తికి వచ్చి ఇలా చేస్తున్నారా అన్నది పక్కన పెడితే మొత్తానికి నామినేషన్ల పర్వంలోనే ఘర్షణలు చోటు చేసుకోవడం వల్ల విపక్ష వైసీపీ అయితే బాధిత పాత్రలోనే తాను ఉన్నాను అంటోంది. ఇది ఏపీలో చర్చగా జరగాలని కోరుకుంటోంది.

**టీడీపీ వ్యూహం :**

ఇక్కడ టీడీపీ వ్యూహం అయితే పాతదే, అందరికీ తెలిసిందే. ఎటూ వైసీపీ ఎన్నికల్లో గెలవలేక పారిపోతూ నిందలు వేస్తోంది అన్నది టీడీపీ నేతల విమర్శలు. నామినేషన్లు కూడా వేసేందుకు వైసీపీకి అభ్యర్థులు లేదన్నది మరో వాదన. అయితే ఏపీలో ఇపుడు నామినేషన్ల పర్వంలో జరుగుతునన్ ఘటనకు దాడులు అన్నీ చూస్తున్న జనాలు మాత్రం వీటి పైన ఎవరికి వారుగా నిర్ణయించుకుంటారు. మొత్తానికి వైసీపీ వర్సెస్ టీడీపీగా సాగిన ఈ స్థానిక పోరులో గెలుపు కంటే వ్యూహాలతోనే అసలు ఆట సాగింది. విజేత ఎవరు అన్నదే అసలైన చర్చ.

## వెస్ట్‌బ్యాంక్‌ను మూసివేసేందుకు సిద్ధమవ్వండి

### సైనికులపై కాల్పుల ఘటనతో చర్యలు

వెస్ట్‌బ్యాంక్‌లోని హెబ్రాన్ సమీపంలో శుక్రవారం జరిగిన కాల్పుల ఘటన ఈ నిర్ణయానికి కారణమైంది. ఈ ఘటనలో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులు మరణించగా, మరో ముగ్గురు గాయపడినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. కాల్పులకు పాల్పడిన ఇద్దరు పాలస్తీనియన్లు కూడా సైనికుల కాల్పుల్లో మరణించారు.ఈ ఘటన అనంతరం హెబ్రాన్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అనుమానితుల కోసం తనిఖీలు, అరెస్టులు చేపట్టారు. దాడికి సంబంధించి మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు.

### ఇళ్లలో సోదాలకు ఆదేశాలు

దాడి జరిగిన ప్రాంతంలో విస్తృత స్థాయిలో భద్రతా చర్యలు చేపడతామని నెతన్యాహు తెలిపారు. అనుమానితులు నివసించిన ప్రాంతాల్లో ఇళ్లవారీగా తనిఖీలు నిర్వహించి, ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు సాయుధ కార్యకలాపాలకు సంబంధించిన మౌలిక వ్యవస్థలను ధ్వంసం చేస్తామని పేర్కొన్నారు.వెస్ట్‌బ్యాంక్ మొత్తాన్ని దిగ్బంధించే చర్యలు ఎప్పటివరకు కొనసాగుతాయనే దానిపై స్పష్టత లేదు. ఈ పరిణామంతో ఆ ప్రాంతంలో రాకపోకలు, సాధారణ ప్రజల ప్రయాణాలపై ఆంక్షలు మరింత పెరిగే అవకాశం ఉంది.

## 'వందేమాతరం'పై సుప్రీంకోర్టులో పిటిషన్.. అది మతపరమైన యుద్ధ గీతమన్న మాజీ ఐఏఎస్!

జాతీయ గేయం 'వందేమాతరం'పై కొత్త వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ప్రభుత్వ, విద్యా సంబంధిత కార్యక్రమాల్లో ఆరు చరణాల వందేమాతరం గేయాన్ని ఆలపించాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆరు చరణాల గేయం 'ఆనందమఠ్' నవలలోనిదని, అది ఒక మతపరమైన యుద్ధ గీతమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.ఈ ఏడాది జనవరి 28, జులై 9 తేదీలలో కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఆరు చరణాల వందేమాతరం పాడాలని నిర్దేశించారు. అయితే, ఈ పూర్తి గేయంలో హిందూ దేవతలైన దుర్గా, లక్ష్మీ, సరస్వతిని స్తుతిస్తూ, ముస్లింలపై విజయం కోసం ప్రార్థించే వైష్ణవ, శాక్తేయ ప్రస్తావనలు ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిని పాడాలని పౌరులను బలవంతం చేయడం వారి మనస్సాక్షి స్వేచ్ఛను హరించడమేనని వాదించారు. ఇది రాజ్యాంగంలోని అధికరణలు 14, 19, 21, 25, 28లకు విరుద్ధమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జాతీయ గేయంగా గుర్తింపు పొందిన తొలి రెండు చరణాలు కేవలం మాతృభూమి సౌందర్యాన్ని, గొప్పదనాన్ని వర్ణిస్తాయని, వాటికి ఎలాంటి మతపరమైన నేపథ్యం లేదని పిటిషన్‌లో వివరించారు. రవీంద్రనాథ్ ఠాగూర్, 1937 నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా తొలి రెండు చరణాలనే ఆమోదించాయని గుర్తుచేశారు. కేంద్రం కొత్త ఉత్తర్వులు దేశ లౌకికవాదం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక స్వరూపాలపై దాడి చేయడమేనని ఆరోపించారు.కాబట్టి, వివాదాస్పద ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, కేవలం తొలి రెండు చరణాలనే జాతీయ గేయంగా అధికారికంగా ప్రకటించాలని పిటిషనర్ కోరారు. అలాగే, మత విశ్వాసాల కారణంగా ఈ గేయాన్ని ఆలపించని వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై గతంలో కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణతో పాటు మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే.

## మెటా గ్లాసెస్‌తో నాపై స్టింగ్ ఆపరేషన్‌కు యత్నం కర్ణాటక సీఎం డీకే శివకుమార్

తనతో పాటు కేరళ సీఎం వీడీ సతీశన్‌ను లక్ష్యంగా చేసుకుని స్టింగ్ ఆపరేషన్ చేసేందుకు ప్రయత్నించారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. బీజేపీ, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రులపై కాకుండా కాంగ్రెస్ నేతలనే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. కన్నడ వార్తా ఛానల్ ఏషియానెట్ సువర్ణ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ ఆరోపణలు చేశారు.ఓ పారిశ్రామికవేత్త తనను కలిసేందుకు వచ్చినప్పుడు మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించి ఉండటంతో అనుమానం కలిగిందని డీకే శివకుమార్ తెలిపారు. అధికారుల ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకున్న ఆ వ్యక్తి తొలుత వ్యాపార విషయాలు మాట్లాడారని, ఆ తర్వాత రాజకీయాలు, బూత్ స్థాయి వ్యూహాలు, రాజకీయ పరిణామాల గురించి చర్చ మొదలుపెట్టారని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి నేపథ్యంపై విచారణ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

ఆ విచారణలో తనకు అందిన సమాచారం ప్రకారం.. ఆ పారిశ్రామికవేత్త కేరళ సీఎం వీడీ సతీశన్‌ను కలిసినప్పుడు కూడా అదే మెటా గ్లాసెస్ ధరించారని డీకే తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను, ఓ కేంద్ర మంత్రిని కలిసినప్పుడు మాత్రం వాటిని ధరించలేదని పేర్కొన్నారు."ఆ వ్యక్తి నా దగ్గరకు, సతీశన్ దగ్గరకు వచ్చినప్పుడే మెటా గ్లాసెస్ పెట్టుకున్నాడు" అని డీకే శివకుమార్ అన్నారు. అయితే ఆ పారిశ్రామికవేత్త పేరును వెల్లడించలేదు. రహస్యంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు నిర్ధారించే ఆధారాలను కూడా ఇంటర్వ్యూలో బయటపెట్టలేదు.ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోలేదన్న ప్రశ్నకు స్పందిస్తూ.. తాము అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని, అయితే ఆ వివరాలను వెల్లడించడం లేదని చెప్పారు. తనకు అనుమానితుల గురించి సమాచారం అందిందని, మంత్రులు వ్యక్తిగత సహాయకులు, ఫోన్ కాల్స్ తదితర మార్గాల ద్వారా జరిగే ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించినట్లు తెలిపారు."మంత్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాధినేతగా నాపై ఉంది" అని డీకే అన్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్నవారి పేర్లు, పత్రాలను సరైన సమయంలో బయటపెడతానని, ప్రస్తుతం వాటిని వెల్లడించే సమయం కాదని పేర్కొన్నారు.కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్యకు సంబంధించినట్లు చెబుతున్న స్టింగ్ వీడియోల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో డీకే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 2011 నాటి వీడియోలను ఉపయోగించి సిద్ధరామయ్యను పదవి నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. అయితే సిద్ధరామయ్యను తొలగించేందుకు స్టింగ్ ఆపరేషన్ చేయించారన్న ఆరోపణలను డీకే ఖండించారు. కాంగ్రెస్ కూడా విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చింది.అక్టోబర్ 8న జరిగిన కేబినెట్ సమావేశంలో, మంత్రులను స్టింగ్ ఆపరేషన్ల ద్వారా ఇరికించే ప్రయత్నాలు జరగవచ్చని డీకే హెచ్చరించినట్లు సమాచారం. సుమారు పది మంది మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు ఓ కేంద్ర మంత్రి, కర్ణాటక బీజేపీ నేత ప్రైవేటు ఏజెన్సీకి నిధులు సమకూర్చారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి కుమార్ గణిగ ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్న పెన్‌డ్రైవ్ తన వద్ద ఉందని చెప్పారు.మరోవైపు, వివాదాస్పద వీడియోల ప్రసారాన్ని అడ్డుకోవాలని కోరుతూ సిద్ధరామయ్య బెంగళూరు కోర్టును ఆశ్రయించారు. పోలీసు విచారణ కూడా కోరారు. అక్టోబర్ 14న రెండు వీడియోల ప్రసారాన్ని నిలిపివేస్తూ మీడియా సంస్థలు, డిజిటల్ వేదికలకు కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. వీడియోల తయారీ, ప్రచారంపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## మహిళా పోలీసుతో తోపులాట.. కిందపడిన విడదల రజని..

పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వైసీపీ నేత విడదల రజని, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో రజని కిందపడిపోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.వివరాల్లోకి వెళితే.. ఎడ్లపాడు జెడ్పీటీసీ అభ్యర్థి బుల్లబ్బాయి, విడదల రజినిని కలిసేందుకు ఆమె నివాసానికి వచ్చారు. అయితే, ఇంటి గేటు వద్ద ఉన్న పోలీసులు బుల్లబ్బాయిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న రజని బయటకు వచ్చి, తమ మద్దతుదారుడ్ని ఇంట్లోకి ఎందుకు అనుమతించడం లేదని పోలీసులను తీవ్రస్థాయిలో ప్రశ్నించారు.ఈ సందర్భంగా చిలకలూరుపేట రూరల్ ఎస్‌ఐ ప్రియాంక, విడదల రజనికి మధ్య వాగ్వాదం జరిగింది. తన మద్దతుదారుడి నామినేషన్‌కు సంబంధించిన బీ-ఫారం తన వద్ద ఉందని, మూడు రోజులుగా తమ వారిని ఇలాగే ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు.ఞ

ఈ క్రమంలో ఎస్‌ఐ అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగి విడదల రజని పక్కకు పడిపోయారు.దీంతో విడదల రజని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎస్‌ఐపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "పిచ్చి పట్టిందా నీకు? నన్ను చంపుతావా నువ్వు? ఏం, మెంటలా నీకు? ఎవడు పంపించాడు నిన్ను ఇక్కడికి?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో రజని నివాసం వద్ద కాసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం, ఆమె తన మద్దతుదారులతో కలిసి అక్కడే నిరసనకు దిగారు.

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలక సమావేశం

- మొదటి పేజీ తరువాయి

సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు.మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

## నేడు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్‌ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

## మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం..

- మొదటి పేజీ తరువాయి

మంగళానందన్ ( ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో .. వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది.ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం' అని మంగళానందన్ పేర్కొన్నారు.

## ఏఐతో భారత్‌కు పెను ముప్పు

### మైక్రోసాఫ్ట్ ఏఐ నిపుణుడి హెచ్చరిక

సైబర్ దాడుల విషయంలో భారత్‌కు పెను ప్రమాదం పొంచి ఉందని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏఐ, సైబర్‌సెక్యూరిటీ పాలసీ డైరెక్టర్ నికోలస్ బట్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులకు అత్యధికంగా గురవుతున్న దేశాల్లో భారత్ ఏడో స్థానంలో ఉండగా, ఆసియాలో మూడో స్థానంలో ఉందని ఆయన తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో ఈ దాడుల తీవ్రత మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన 'ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2026'లో ఆయన ఈ కీలక విషయాలు వెల్లడించారు. "భారత్‌కు ముప్పు చాలా వాస్తవమైనది. ఇది పదేళ్ల తర్వాత జరగబోయే ప్రమాదం కాదు, ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న భద్రతా సవాలు" అని ఆయన నొక్కిచెప్పారు. తాము ప్రతిరోజూ 165 ట్రిలియన్ల టెలిమెట్రీ సిగ్నళ్లను విశ్లేషిస్తామని, 5 మిలియన్ల కొత్త మాల్‌వేర్‌లను అడ్డుకుంటామని, అందుకే తమకు ఈ ముప్పుపై స్పష్టమైన అవగాహన ఉందని వివరించారు.భారత్‌కు పొంచి ఉన్న మూడు ప్రధాన ముప్పుల గురించి బట్స్ వివరిస్తూ, "చైనా కేంద్రంగా పనిచేస్తున్న 'స్టార్మ్ 3168' అనే రాన్సమ్‌వేర్ సంస్థ, ఏఐ ఏజెంట్లను ఉపయోగించి దాడులకు పాల్పడుతోంది. అలాగే, డేటా దొంగతనం, గూఢచర్యం లక్ష్యంగా చైనా ప్రభుత్వ ప్రేరేపిత 'స్టార్మ్ 0940' పనిచేస్తోంది" అని తెలిపారు.వీటితో పాటు, 'ఈవిల్‌టోకెన్స్' అనే సైబర్ ముఠా ఏఐ టూల్స్‌ను కేవలం 1,500 డాలర్లకే అమ్ముతోందని, దీనివల్ల 120 దేశాల్లో 10,000కు పైగా సంస్థలు ప్రభావితమయ్యాయని బట్స్ పేర్కొన్నారు. ఏఐని ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు మరింత శక్తివంతంగా మారుతున్నారని తెలిపారు.

# నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తాం

## -ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23**

15వ వార్డులో వైసీపీ అభ్యర్థి బైసాని రమేష్ బాబు గెలుపే లక్ష్యంగా ఎన్నికల ప్రచారం

నంద్యాలలో ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తామని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ధీమా వ్యక్తం చేశారు. నంద్యాల 15వ వార్డులో వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబు విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగించారు. వైఎస్ఆర్సిపి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి చైర్మన్ అభ్యర్థి దాల్ మిల్ అమీర్‌తో పాటు 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బైసాని రమేష్ బాబును ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజల మద్దతుతో నంద్యాలలో వైఎస్ఆర్సిపి ఘన విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు

# పెన్ పవర్ రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# నంద్యాలలో అభివృద్ధి శూన్యం.. అక్రమాలు, భూకబ్జాలే ఫుల్!.. శిల్పా

- ఇది మంచి ప్రభుత్వం కాదు.. ప్రజలను ముంచే ప్రభుత్వం!
- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి...



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23**

ఈరోజు సాయంత్రం నంద్యాల పట్టణంలోనినూనెపల్లె, సాయి బాబా నగర్ లో మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రాష్ట్రంలో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక ధరల భారం మోపి వారి నడ్డి విరిచిందని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి విమర్శించారు. నంద్యాలలో మంత్రి పాలనలో అభివృద్ధి శూన్యమని, అక్రమాలు, భూకబ్జాలు రౌడీయిజం పెరిగాయని ఆయన ఆరోపించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని, పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని పేర్కొన్నారు.

నంద్యాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ చైర్మన్ అభ్యర్థి దాల్మిల్ అమీర్‌తో పాటు 26వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సునీత అమృత రాజ్, 27వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఉషేనమ్మ, 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మభూమ్నిసా, 37వ వార్డు షేక్ శివనాజ్
లను గెలిపించాలని వైసీపీ నాయకులు ప్రజలను కోరారు.

ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ అభ్యర్థులను గెలిపించి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలని కోరారు.

# నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో టీడీపీకి షాక్!

- మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో భారీ చేరికలు




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23**

నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో తెలుగుదేశం పార్టీకి షాక్ తగిలింది. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి సమక్షంలో బొజ్జ ఎల్లారెడ్డి, ఆళ్లగడ్డ రవీంద్రనాథ్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మంగలి రవీంద్రబాబు, బోయ సురేంద్ర, పబ్బతి రాజన్న తదితరులు తమ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారందరినీ వైసీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని పక్కనపెట్టి, టీడీపీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో వైసీపీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

పులిమద్ది గ్రామంలో జరిగిన ఈ చేరికలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# టీడీపీలోకి కొనసాగుతున్న చేరికల జోరు..

## మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో చేరిన వైఎస్సార్సీపీ సీనియర్ కార్యకర్తలు

- గత 20 ఏళ్లుగా వైఎస్సార్సీపీలో పనిచేస్తున్న 2వ వార్డు కీలక నేతలు టీడీపీ గూటికి
- పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్, యువ నాయకులు ఫిరోజ్, ఫయాజ్
- మాజీ కౌన్సిలర్ నాగార్జున ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 22**

నంద్యాల పట్టణంలో తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ మరింత బలోపేతమవుతోంది. కూటమి ప్రభుత్వ పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. నంద్యాల పట్టణంలోని 2వ వార్డులో గత 20 సంవత్సరాలుగా వైఎస్సార్సీపీ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కీలక నాయకులు, కార్యకర్తలు మాజీ కౌన్సిలర్ నాగార్జున ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, యువ నాయకులు ఎన్ఎండి ఫిరోజ్, ఎన్ఎండి ఫయాజ్ గార్ల సమక్షంలో వారు అధికారికంగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో 2వ వార్డుకు చెందిన మసీదు సురేష్, నారాయణ, గణ మద్దిలేటి, జాషువా, సుంకన్న, మధు, దయ, మనోహర్ తదితరులు ఉన్నారు.




వీరికి మంత్రి ఎన్ఎండి ఫరూక్, యువ నాయకులు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. మంత్రి ఎన్ఎండి ఫరూక్ నిస్వార్ధ నాయకత్వం, ప్రజాసేవపై పూర్తి నమ్మకంతోనే తాము తెలుగుదేశం పార్టీలో చేరినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వార్డులో పార్టీ అభ్యున్నతికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సైనికుల్లా పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తొట్టంబేడు జడ్పీటీసీ అభ్యర్థిగా గురవయ్య నామినేషన్

## ప్రజల పక్షాన పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి



**తొట్టెంబేడు,పెన్ పవర్,అక్టోబర్ 23:**

తొట్టంబేడు జడ్పీటీసీ సీపీఎం అభ్యర్థిగా పెనగడం గురవయ్య శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తిరుపతి డీఆర్డీఏ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, తిరుపతి నగర కార్యదర్శి వేణు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని గురవయ్య కోరారు.

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం..

- పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గెలుపు బాధ్యత ప్రతి కూటమి నాయకుడు, కార్యకర్తది..

**నెల్లూరు, అక్టోబర్ 23, పెన్ పవర్ స్టేడ్ బ్యూరో**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు పిలుపునిచ్చారు. ఇందుకూరుపేట జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గారిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత కూటమి శ్రేణులందరిపై ఉందని ఆమె స్పష్టం చేశారు.నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ తరఫున ఇందుకూరుపేట జడ్పీటీసీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గారు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారితో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా కూటమి శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. పరస్పర సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి, కూటమి అభ్యర్థికి సంపూర్ణ మద్దతు కూడగట్టాలని ఆమె పిలుపునిచ్చారు. అందరి సహకారంతో పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి గారిని జడ్పీటీసీ సభ్యునిగా భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమాను వ్యక్తం చేశారు.

# నంద్యాల జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ....

- జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఐపీస్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23**

నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 28 మండలాల్లో జెడ్పీటీసీ (జడ్పీటీసీ ), ఎంపీటీసీ (ఎంపీటీసీ ) స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా కొనసాగుతోంది. అన్ని నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది.

అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతించి, టోకెన్లు జారీ చేస్తూ నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయిస్తున్నారు.

అభ్యర్థులకు ఎక్కడైనా ఇబ్బందులు లేదా ఆటంకాలు ఎదురైతే, సంబంధిత నామినేషన్ కేంద్రంలోని పోలీసులను నేరుగా సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసులు పూర్తి సహకారం అందిస్తారని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ పటిష్టమైన




భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ మీడియాకు వివరించడం జరిగింది.

# అభివృద్ధే మా అజెండా-పొంగూరు రమాదేవి

- నెల్లూరు లో హీటెక్కుతున్న కార్పొరేషన్ పోరు
- జడివానలోనూ తగ్గని ప్రచార దూకుడు.
- రోజుకు 12 డివిజన్లలో మంత్రి కుటుంబం పర్యటనలు.
- అభివృద్ధే అజెండాగా సాగుతున్న ప్రచారం

**పెన్ పవర్, అక్టోబర్ 23, నెల్లూరు జిల్లా బ్యూరో**

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో తెలుగు తమ్ముళ్లు దూకుడు పెంచారు. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మంత్రి పొంగూరు నారాయణ కుటుంబం ప్రచార బాధ్యతలను భుజాన వేసుకుని డివిజన్లను చుట్టేస్తోంది. మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి, కుమార్తెలు సింధూర, షరణి రోజుకు సుమారు 12 డివిజన్లలో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

జడివానను సైతం లెక్కచేయకుండా 59, 65, 62, 66 డివిజన్లలో రమాదేవి ప్రచారం సాగించారు. ఆమెతో పాటు తెలుగు మహిళలు వర్షంలోనూ అడుగులు కలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ, వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్పొరేటర్ అభ్యర్థులు దర్శి హరికృష్ణ, ధర్మవరం గణేష్, పొట్లూరి రామకృష్ణ, కపిర రేవతితో పాటు మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్‌ను ఆశీర్వదించాలని ఓటర్లను



కోరారు. రమాదేవి పర్యటనలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.తమ బిడ్డల చదువులకు బంగారు బాటలు వేస్తున్న మంత్రికి అండగా ఉన్న ఆయన సతీమణి రమాదేవికి డివిజన్ లలో గుమ్మడికాయలతో దిష్టి తీసి,మంగళహారతులతో మహిళలు స్వాగతం పలికారు.

మంత్రి నారాయణ నేతృత్వంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులనే ప్రధాన ప్రచారాస్త్రంగా టీడీపీ ముందుకు తీసుకెళ్తోంది. నగరాభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన కనిపిస్తోందని రమాదేవి పేర్కొంటున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నారాయణ నేత్రజ్యోతి ద్వారా కంటి పరీక్షలు, ఉచిత కళ్లద్దాలు, అవసరమైన శస్త్రచికిత్సలు అందిస్తున్నామని వివరిస్తున్నారు. నారాయణ ఆన్ వీల్స్, నారాయణ దంత సురక్ష కార్యక్రమాల ద్వారా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.

వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేయడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందించిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారు. పేదల సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ఓటర్ల మద్దతు కూడగడుతున్నారు.

విమర్శలకు అభివృద్ధితోనే సమాధానం

మంత్రి నారాయణకు లభిస్తున్న ప్రజాదరణను కొందరు ఓర్వలేకపోతున్నారని, పేదల కోసం చేపడుతున్నకార్యక్రమాలపైనావిమర్శలు చేస్తున్నారని రమాదేవి పేర్కొంటున్నారు.విమర్శలకు వెనక్కి తగ్గకుండా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మంత్రి నారాయణ ముందుకు సాగుతున్నారని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్నారని ప్రచారంలో వివరిస్తున్నారు.

నగరంలోని మొత్తం 72 డివిజన్లతో పాటు మేయర్ పీఠాన్ని కూడా కైవసం చేసుకుంటామన్న ధీమాను టీడీపీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధిస్తారని రమాదేవి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాగుతున్న ప్రచారంతో నెల్లూరు నగర ఎన్నికల పోరు మరింత వేడెక్కుతోంది.

# కార్పొరేషన్ ఎన్నికల్లో కోటంరెడ్డి కుటుంబం దూకుడు.

- అనేక డివిజన్ లలో విస్తృత ప్రచారం.
- జోరు వర్షంలోనూ ఆత్మీయ సమావేశాల్లో కోటంరెడ్డి సుజిత, లక్ష్మీ హైందవి, సాయి వైష్ణవి.
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

**నెల్లూరు, అక్టోబర్ 23, పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి కుటుంబం మొత్తం ఎన్నికల ప్రచార రంగంలో ముందుకు దూసుకుపోతున్నారు. నామినేషన్ల ప్రారంభమైన దగ్గర నుంచి రూరల్ పరిధిలోని 36 డివిజన్ల పరిధిలో ఆత్మీయ సమావేశాల తేదీలను ఖరారు చేసి, ఒక్కో డివిజన్ లలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు.రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజిత, కుమార్తెలు లక్ష్మీ హైందవి, సాయి వైష్ణవి తదితరులు ఇప్పటికే అనేక డివిజన్లో ఆత్మీయ సమావేశాలలో పాల్గొని అక్కడ స్థానికులతో మమేకమయ్యారు. గత రెండు సంవత్సరాలుగా కూటమి ప్రభుత్వ హాయంలో రూరల్ నియోజకవర్గం లో జరిగిన 966 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను స్థానికులకు వివరిస్తున్నారు. స్థానికంగా ఇంకా ఏమైనా రోడ్లు, రహదారులు, కాలువలు అసంపూర్తిగా ఉన్నాయా స్థానికంగా ఇంకేమన్నా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలతో కలిసిపోతున్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తో పాటు కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి



చేస్తున్నారు.గత ఐదు రోజులుగా వర్షాలు పడుతున్న ఇప్పటికే రూరల్ పరిధిలోని సగం డివిజన్లలో కోటంరెడ్డి కుటుంబం ఎన్నికల ప్రచారాన్ని తమదైన శైలిలో నిర్వహిస్తూ ప్రజల ఆదరాభిమానాలు పొందుతున్నారు. కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవాలనే లక్ష్యంతో వారు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి డివిజన్ లో పర్యటిస్తున్నారు. స్థానిక ప్రజలతో వారికి విస్తృతమైన సంబంధాలు మొదటి నుంచి ఉండడంతో అందరినీ పేరుపేరునా పలకరిస్తూ వారితో మమేకమవుతున్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఎప్పటికప్పుడు ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ గెలుపు బాధ్యతలను తీసుకున్నారు.

# కొండలమ్మ భక్తులకు అన్నప్రసాద వితరణ...

**నెల్లూరు, అక్టోబర్ 23, పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుచున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శుక్రవారం అన్నప్రసాద వితరణను నిర్వహించారు. దాతలు గుడివాడ వాస్తవ్యులు డాక్టర్ బి.నాగేశ్వరరావు, లక్ష్మీ రమణ కుమారి దంపతులు మరియు కుటుంబ సభ్యులచే ఆర్థికసాయంతో కొండలమ్మ భక్తులకు ఈ అన్నప్రసాద వితరణను నిర్వహించినట్లు దేవస్థాన చైర్మన్ ఈడే మోహన్, ఈఓ ఆకుల కొండలరావు పేర్కొన్నారు. దాతలను శేష వస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## నెల్లూరు నగరంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ముమ్మర ప్రచారం

**- 58, 63 డివిజన్లలో కూటమి నేతలతో కలిసి పర్యటన**

**- మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్, 58, 63వ డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు కరీముల్లా, జుబేరుద్దీన్‌లకు మద్దతుగా ప్రచారం**

**-మంత్రి నారాయణ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి మసీదుల్లో ప్రార్థనలు**

**పెన్ పవర్, అక్టోబర్ 23, నెల్లూరు జిల్లా బ్యూరో**

కూటమి నేతలు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు కూటమి నాయకులతో కలిసి శుక్రవారం నగర పరిధిలోని 58, 63 డివిజన్లలో పర్యటించారు. గడిచిన రెండున్నరేళ్లలో కార్పొరేషన్ పరిధిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ గారు, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ గారితో కలిసి మేయర్ అభ్యర్థి పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్, 58వ డివిజన్



కార్పొరేటర్ అభ్యర్థి కరీముల్లా, 63వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మొహమ్మద్ జుబేరుద్దీన్‌లను గెలిపించాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా జెండా వీధిలోని హల్‌తాలీమ్ మసీదు, కోటమిట్ట మెక్లీన్ రోడ్డులోని ఖతీజా మసీదులో కూటమి నాయకులు, ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు.

## కూటమి నేతల సమన్వయంతో నామినేషన్ల పర్వం విజయవంతం

**- పారదర్శకంగా, ప్రశాంతంగా ప్రక్రియ పూర్తి**

**- నామినేషన్ల ప్రక్రియలో సహకరించిన నాయకులు, కార్యకర్తలకు బీజేపీ నేత కోలా ఆనంద్ కృతజ్ఞతలు**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్, అక్టోబర్ 23:**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం నేటితో ముగిసిన నేపథ్యంలో, కూటమి నాయకుల సమన్వయం, పరస్పర సహకారంతో నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని బీజేపీ నేత కోలా ఆనంద్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కూటమి నేతల ఐక్యత, సమష్టి కృషి కీలకంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ల ప్రక్రియలో కూటమి నాయకులందరూ సమన్వయంతో ముందుకు సాగారని, ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవిస్తూ పరస్పర సహకారంతో వ్యవహరించారని కోలా ఆనంద్ వెల్లడించారు. ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు నాయకులు, కార్యకర్తలు తమ వంతు సహకారం అందించారని తెలిపారు.

**కూటమి ఐక్యతే విజయానికి బలం!**

కూటమి పార్టీల మధ్య ఉన్న సమన్వయం, ఐక్యత, పరస్పర అవగాహనతోనే నామినేషన్ల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయగలిగామని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ కూటమి బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

**సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు**

నామినేషన్ల ప్రక్రియలో సహకరించిన కూటమి నాయకులు, కార్యకర్తలకు కోలా ఆనంద్ ప్రత్యేక



కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

## కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా నంద్యాల సమగ్ర అభివృద్ధి: రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్

**- 15వ వార్డు బీజేపీ అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్, 16వ వార్డు టీడీపీ అభ్యర్థి జైనాబి లకు మద్దతుగా విస్తృత ప్రచారం**

**- పద్మావతి నగర్, సుద్దులపేటలో ఘన స్వాగతం పలికిన ప్రజలు**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23:**

నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు.



నంద్యాల టౌన్ పరిధిలోని 15వ వార్డు కూటమి తరపున భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్, అలాగే 16 వ వార్డు కూటమి తరపున తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థి శ్రీమతి జైనాబి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం స్థానిక పద్మావతి నగర్ మరియు సుద్దులపేట ప్రాంతాలలో మంత్రి ఫరూక్ విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు ఆయా ప్రాంతాల ప్రజలు, మహిళలు, కూటమి శ్రేణులు అడుగడుగునా పూలవర్షం కురిపించి, ఘన స్వాగతం పలికారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా మంత్రి ఫరూక్ స్థానికులను కలుస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని, ప్రతి వార్డును అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు . ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం అందుబాటులో ఉండే 15వ వార్డు బీజేపీ అభ్యర్థి పబ్బతి వేణుగోపాల్ ని, 16వ వార్డు టీడీపీ అభ్యర్థి జైనాబి అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నామినేషన్ల పరిశీలనపై టీడీపీ ప్రత్యేక దృష్టి

**- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పార్టీ నేతలు**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 23:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ అభ్యర్థులకు అండగా నిలుస్తూ, నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ, పార్టీ అభ్యర్థులకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు అండగా నిలవడం ద్వారా పార్టీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్తున్నారు. పార్టీ బలోపేతం, ప్రజాసేవ, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తున్నారు.

నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియను నిశితంగా గమనిస్తూ, పార్టీ అభ్యర్థులకు సహకారం అందించడంపై నాయకులు దృష్టి కేంద్రీకరించారు.

## ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణలో నిబంధనలు పక్కాగా అమలు చేయాలి

- అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలి

- నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా, పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 23:- ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండల కేంద్రాల్లో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి కొనసాగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లను తనిఖీ చేసి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని, నిర్దేశిత విధివిధానాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలు, స్వీకరణ సమయంలో నిబంధనల ప్రకారం ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు.

శిరివెళ్ల, దొర్నిపాడు మండల కేంద్రాల్లో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి కలెక్టర్



నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు.

ఆళ్లగడ్డ మండల కేంద్రంలో సబ్ కలెక్టర్ మనీషాతో కలిసి నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు, అభ్యర్థులకు సజావుగా నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## వరదయ్యపాలెం జెడ్పీటీసీ బరిలో కాంగ్రెస్ అభ్యర్థి కే. సాయి లక్ష్మి

– డీఆర్‌డీఏ కార్యాలయంలో నామినేషన్ దాఖలు.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి

వరదయ్యపాలెం, పెన్ పవర్, అక్టోబర్ 23: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వరదయ్యపాలెం జెడ్పీటీసీ స్థానానికి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) పార్టీ అభ్యర్థిగా కే. సాయి లక్ష్మి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. గురువారం తిరుపతి జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను అధికారికంగా సమర్పించారు.



ఈ సందర్భంగా కే. సాయి లక్ష్మి మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు వరదయ్యపాలెం జెడ్పీటీసీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచినట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పోటీ చేస్తున్నానని పేర్కొంటూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తన విజయానికి కృషి చేయాలని కోరారు.అలాగే, వరదయ్యపాలెం మండల ప్రజలు తనపై నమ్మకం ఉంచి, ఆదరించి, అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కే. సాయి లక్ష్మి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేస్తామని నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

**- ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నామినేషన్ల పరిశీలన చేపట్టాలి**

**- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 23**

పోలీస్ యంత్రాంగం సమన్వయంతో జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. తదుపరి నిర్వహించనున్న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియను ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో నామినేషన్ల పరిశీలనపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ పత్రాల పరిశీలన, డిపాజిట్ రుసుము, ఫారం–బి సమర్పణ, అభ్యర్థుల అర్హత తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నామినేషన్ పత్రాలపై అభ్యర్థి, ప్రతిపాదకుడి సంతకాల ప్రామాణికతను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, ఎన్ని సెట్ల నామినేషన్లు దాఖలు చేసినా నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఒక్క సెట్ చెల్లుబాటైతే అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. డిపాజిట్ రుసుమును ఒక్కసారి మాత్రమే స్వీకరించాలని, అదనంగా వసూలైన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని స్పష్టం



చేశారు. ఫారం–బి సమర్పణ గడువు, నామినేషన్ల ఉపసంహరణ, ఓటరు జాబితాలో మార్పుల కోసం సమర్పించిన ఫారం–8 దరఖాస్తులు తదితర అంశాలను సంబంధిత నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రతి నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు.

## మొగల్తూరు ఎంపీటీసీ మూడో స్థానం నుంచి ఇంజేటి లలిత కుమారి

**పెన్ పవర్ అక్టోబరు 23**

మొగల్తూరు పంచాయతీ ఎంపీటీసీ మూడో స్థానం నుంచి జనసేన పార్టీ బలపరిచిన కూటమి అభ్యర్థిగా ఇంజేటి లలిత కుమారి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సహకారంతో గ్రామానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి, గ్రామంలో మౌలిక వసతులతో పాటు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అవసరమైన నిధులు సమకూర్చుకుని గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడమే తన లక్ష్యమని లలిత కుమారి వెల్లడించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## ఓటమి భయంతోనే దాడులు.. ప్రజాస్వామ్యాన్ని అణచలేరు

**- శ్రీకాళహస్తిలో టీడీపీ హింసాత్మక రాజకీయాలపై మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆగ్రహం**

**- మహిళలపై దౌర్జన్యాలు, వాహనాల ధ్వంసంపై నేతల ఆందోళన.. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం: వైఎస్సార్‌సీపీ నేతలు**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 23:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలు, దాడులు, వాహనాల ధ్వంసం వంటి ఘటనలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవాల్సిన రాజకీయ పార్టీలు దౌర్జన్యాలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు. ఓటమి భయంతోనే ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీ నాయకులపై ఆరోపణలు చేశారు. ఈ మూడు రోజులుగా నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రజలందరూ గమనిస్తున్నారని, ప్రజలే తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు.

**అధికార అహంకారంతో ప్రజాస్వామ్యాన్ని అణచలేరు**

ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో శ్రీకాళహస్తిలో ఎన్నడూ లేని విధంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. ప్రత్యర్థులను భయపెట్టడం, దాడులకు పాల్పడటం, కార్లు, ఆటోలను ధ్వంసం చేయడం వంటి చర్యలతో రాజకీయంగా పైచేయి సాధించాలనుకోవడం సరికాదన్నారు. దౌర్జన్యాలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని, అధికార అహంకారంతో ప్రజాస్వామ్యాన్ని అణచివేయలేరని స్పష్టం చేశారు.

దాడులు చేసి భయపెట్టినంత మాత్రాన తమ పార్టీ కార్యకర్తలు, అభ్యర్థులు వెనక్కి తగ్గబోరని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని పొందడం ద్వారా విజయం సాధించాలి తప్ప, ప్రత్యర్థులను



భయపెట్టడం ద్వారా కాదని హితవు పలికారు.

**నా బిడ్డలపై నాన్ బెయిలబుల్ కేసులా?**

న్యాయం కోసం పోరాటం చేస్తున్న తమ పార్టీ కార్యకర్తలు, నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడంపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూనే, మరోవైపు న్యాయం కోసం నిలబడుతున్న వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి కేసులకు తాము భయపడబోమని, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

అలాగే భవాని మాల ధరించిన తన పార్టీకి చెందిన మహిళపై అసత్య ఆరోపణలు చేశారని విమర్శించారు. తనపై చేసిన ఆరోపణల విషయంలో కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. ఈ ఆరోపణలు, సవాళ్లపై సంబంధిత వ్యక్తుల స్పందన తెలియాల్సి ఉంది.

**మహిళలపై దాడులు సిగ్గుచేటు: ఎంపీ మద్దెల గురుమూర్తి**

తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. బాధితులకు, అభ్యర్థులకు న్యాయం జరిగేలా అవసరమైన న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**దాడులకు భయపడేది లేదు.. పోరాటం ఆపేది లేదు: ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం**

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ, కార్లు, ఆటోలను ధ్వంసం చేయడం, వ్యక్తులపై భౌతిక దాడులకు దిగడం వంటి ఘటనలు ఆమోదయోగ్యం కావని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలను అరికట్టాలని అధికారులను కోరారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలకు భయపడేది లేదని, అన్యాయానికి వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**పార్టీ శ్రేణులకు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు**

ఈ సందర్భంగా ఘర్షణల సమయంలో వెనుకడుగు వేయకుండా నిలబడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలకు బియ్యపు మధుసూదన్ రెడ్డి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధైర్యంగా నిలబడి తమకు అండగా ఉన్న అక్కచెల్లెమ్మలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

అలాగే ఘటనలను చిత్రీకరించి ప్రజలకు సమాచారాన్ని చేరవేసిన మీడియా ప్రతినిధులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, దాడులకు సంబంధించిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావుండకూడదని, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసుకునే, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# 13వ వార్డు లో జరిగిన ఇంటింటి ప్రచారం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**
మాచర్ల పట్టణంలో మాచర్ల అభివృద్ధి ప్రధాత, పల్నాటి పులి జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఎనుముల కేశవరెడ్డి సతీమణి ఎనుముల సుష్మా రెడ్డి ని మరియు 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చల్లా నాగమణి ని అఖండ మెజారిటీతో గెలిపించాలని 13 వార్డు ప్రజలతో మమేకమవుతూ, ఎన్డీఏ కూటమి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ, తమ అమూల్యమైన ఓటును తెలుగుదేశం పార్టీకి వేయాలని అభ్యర్థించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు జంధ్యాల సత్యనారాయణ, వార్డు నాయకురాలు వేముల మంగమ్మ, 10వ వార్డు 68వ బూత్ ఇంచార్జ్ షేక్ జానీ భాష, మల్లెల శివ, బత్తుల చెన్న మరియు టీడీపీ,జనసేన పార్టీ ల కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగింది.



# 15వ వార్డు అభివృద్ధి కోసమే నా పోరాటం: టీడీపి కౌన్సిలర్ అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**
మాచర్ల మున్సిపాలిటీ 15వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ్మిశెట్టి ఏడుకొండలు వార్డు సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. వార్డులోని ప్రతి ఇంటికీ తిరుగుతూ, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి తనను అత్యంత భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరుతున్నారు.
వార్డును దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగునీరు సమస్యలు, వీధిలైట్ల కొరత, మరియు సురక్షిత త్రాగునీటి సమస్యలపై ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "వార్డులో ఉన్న ప్రతి సమస్యను నా సొంత సమస్యగా భావించి, మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి చేస్తాను" అని ఏడుకొండలు ప్రజలకు నమ్మకమైన భరోసా ఇచ్చారు. 15వ వార్డు రూపురేఖలు మారాలన్నా, మౌలిక వసతులు మెరుగుపడాలన్నా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ్మిశెట్టి ఏడుకొండలుకు తమ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నారు.



# కార్యకర్త పార్థివ దేహానికి నివాళులు, ఆర్థిక సహాయం అందజేత



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, అక్టోబర్ 23;**
మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ కార్యకర్త కొమెర కృష్ణ ఆరోగ్యంతో మృతి చెందగా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేస్తూ మట్టి ఖర్చులకు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, 15వ వార్డు టిడిపి అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు, తిరుమల కొండ జమలయ్య, కొమెర శ్రీను దేరంగుల పెద్ద దాసరయ్య, కొమెర సాంబ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 29వ వార్డు లో జరిగిన ఇంటింటికీ ఎన్నికల ప్రచార కార్యక్రమం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**
మాచర్ల పట్టణంలోని 29వ వార్డు లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి యొనుముల సుష్మా రెడ్డి కుమారుడు అర్జున్ రెడ్డి, 29వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి దొడ్డా అచ్చమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# గుండెపోటుతో మారుతీ ఆకస్మిక మృతి

**-బాధిత కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సహాయం.**
**-ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో పరామర్శ.**
**-కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ నాయకుల భరోసా.**



**కుందుర్పి, అక్టోబర్ 23, ( జనసముద్రం న్యూస్):**
కుందుర్పి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బెస్తరపల్లి ఓబుళపతి కుమారుడు మారుతీ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం రాత్రి మారుతీ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మారుతీ ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.
మారుతీ మృతి పట్ల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, దేవినేని ధర్మతేజ సూచనలతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని తండ్రి ఓబుళపతితో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
మారుతీ కుటుంబానికి అండగా నిలిచిన టీడీపీ నాయకులు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.11 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబ సభ్యుడిని కోల్పోవడం తీరని లోటని, ఇటువంటి కష్ట సమయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మారుతీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవనం సాధ్యం







**జన సముద్రం న్యూస్ , పల్నాడు జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 23.**
మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవన విధానం సాధ్యమని డిస్ట్రిక్ట్ కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు అన్నారు.
ప్రపంచ మానసిక ఆరోగ్య నెలలో భాగంగా ముప్పాళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు, డ్రాయింగ్ మరియు వకృత్వ పోటీలు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ హెచ్.ఎం శ్రీమతి సి.హెచ్. ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,
విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీ తత్వాన్ని అలవరచుకోవడం ద్వారా మానసిక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు.
అనంతరం కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టడం, కష్ట సమయాల్లో ఒత్తిడిని అధిగమించడం, ఆత్మహత్యల నివారణ మరియు మంచి కెరీర్ నిర్మాణం కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ, మానసిక ఆరోగ్యంపై సదస్సులు ఎంతో దోహదపడతాయని వివరించారు.
రెండు రోజుల పాటు జరిగిన ఈ అవగాహన సదస్సు, పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి చేతుల మీదుగా అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి, కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 36వ వార్డు లోని ఆజాద్ నగర్, వినాయక గుట్ట లో జరిగిన ఇంటింటి ప్రచారం



**జనసముద్రంన్యూస్,మాచర్ల, పల్నాడు జిల్లా, అక్టోబర్ 23;**
మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాచర్ల పట్టణంలోని 36వ వార్డు అజాద్ నగర్, వినాయక గుట్ట నందు ఇంటింటికి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొనటం జరిగిందిని మిద్దెపోగు రాజేష్, జంపుల సాయి, 36 వార్డు జనసేన అజాద్ నగర్ వినాయకగుట్ట ఇన్ఛార్జ్ తెలియజేశారు.

# మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరు



**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 23:**
మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిన్న 18, 19, 20, 21 వార్డుల్లో టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డి పర్యటించారు.
వారికి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు సాదరంగా ఆహ్వానం పలికారు.
అనంతరం యాగంటి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.
ఈ సందర్భంగా టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డితో పాటు
18వ వార్డు అభ్యర్థి మదిగపు శ్రీనివాసరెడ్డి , 19వ వార్డు అభ్యర్థి బండ్ల అనురాధ ,20వ వార్డు అభ్యర్థి పోలా సత్యం , 21వ వార్డు అభ్యర్థి కొప్పుల శివ లను సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.
ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జున రావు మాట్లాడుతూ, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి అందిస్తామని, ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. త్వరలోనే బుగ్గ వాగు నుంచి మంచినీటి సరఫరా అందుతుందని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ అభ్యర్థిగా కొల్లాటి ఉషారాణి నామినేషన్

**- పవన్ కళ్యాణ్, బొమ్మిడి నాయకర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం**
**- 200 స్ట్రైక్ రేట్‌తో గెలుపే లక్ష్యమన్న కొల్లాటి గోపి**

**మొగల్తూరు అక్టోబర్ 23**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**
మొగల్తూరు మండలం మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ అభ్యర్థిగా కొల్లాటి ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆమె అభ్యర్థిత్వం ప్రకటించడంతో ఎన్నికల సందడి నెలకొంది.
ఈ సందర్భంగా కొల్లాటి గోపి మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో 200 స్ట్రైక్ రేట్‌తో గెలుపు దిశగా పయనిస్తామని కొల్లాటి గోపి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ స్థానంలో కొల్లాటి ఉషారాణి నామినేషన్‌తో స్థానిక ఎన్నికల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.





# మాచర్ల లోని 20వ వార్డు లో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచారం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**
మాచర్ల పట్టణం లో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 20వ వార్డులో మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా రెడ్డి, 20 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలా చిన్న సత్యం పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎనుముల సుష్మా రెడ్డి ని, వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి పోలా చిన్న సత్యం ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# కుక్కునూరు జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన తరఫున యర్ణం సరోజినీ నామినేషన్ దాఖలు



**కుక్కునూరు, అక్టోబర్ 23, 2026,**
**జనసముద్రం ప్రతినిధి, మణికంఠ**
జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున యర్ణం సరోజినీ శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం లో నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, బి జె పి పార్టీలు బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా ఆమె బరిలో నిలిచారు.
నామినేషన్ దాఖలు కార్యక్రమంతో కుక్కునూరు
జనసేన పార్టీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా యర్ణం సరోజినీ ఎన్నికల బరిలో నిలవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం ఆయన అడుగులు వేస్తున్నారు. స్థానికంగా కూడా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన కావడంతో గ్రామాల అభివృద్ధి , కనీస మౌలిక సదుపాయాలు వంటివి యర్ణం సరోజిని గెలిస్తే మండల అభివృద్ధి జరుగుతుంది అని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మదనపల్లిలో కూటమి ధర్మానికి తూట్లు పొడిచిన టిడిపి

**- మదనపల్లిలో ఒకటి మరియు 34 వార్డులో టిడిపి మరియు జనసేన ఇరు వర్గాలు ఫోటో పోటీగా నామినేషన్ దాఖలు చేశారు.**
**- జనసేన పార్టీ అభ్యర్థులను బెదిరిస్తున్న టిడిపి నాయకులు.**

**జనసముద్రం న్యూస్, మదనపల్లి, అక్టోబర్ 23:-**
మదనపల్లి మున్సిపాలిటీ లో 1, 34 వార్డులు జనసేనకు కేటాయించగా, అయితే టిడిపి కూడా బీఫాం సమర్పించి నామినేషన్ వేయడం కూటమి ధర్మానికి తూట్లు పొడిచారు. ఒకటో వార్డు మరియు 34 వ వార్డులో జనసేన వారు నామినేషన్ వేసి ప్రచారం చేస్తున్నప్పటికీ టిడిపి నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులని ప్రచారం చేయొద్దు అంటూ అడ్డుపడుతున్నారని దారం అనిత తన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ మదనపల్లి టిడిపి నాయకులపై మండిపడ్డారు. ఇలా చేయడం కూటమి ధర్మం కాదని ఏదైనా ఉంటే టిడిపి అధిష్టానం జనసేన అధిష్టానం తో మాట్లాడుకోవాలని, స్థానికంగా మమ్మలని ప్రచారం చేయొద్దనడం బెదిరించడం సభము కాదని దారం అనిత టిడిపి నాయకులకి విజ్ఞప్తి చేశారు.



# రాయికల్ సరస్వతీ శిశుమందిర్ నూతన భవన నిర్మాణానికి గుర్రం సుదర్శన్ 5,00,000/- విరాళం

భారతీయుల సంస్కృతి సనాత ధర్మాన్ని కాపాడాలని ఉద్దేశంతో రాయికల్ పట్టణంలో గతంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాల నడుస్తుండేది మధ్యలో అట్టి బ్రాంచిని తిసివేసి వెళ్లిపోయిన సరస్వతి శిశు మందిర్ విద్యాపీఠం కు మళ్లీ రాయికల్ కు అనుమతి ఇవ్వాలని రాయికల్ పుర ప్రముఖులు మన సంస్కృతి చచ్చిపోయే రోజుల్లో కాపాడటానికి ముందుకొచ్చి మన సంస్కృతిని కాపాడాలని ఉద్దేశంతో మన సనాతన ధర్మాన్ని రక్షిద్దాం అని

మన పూర్వీకుల గుణగణాలను తెలిపే శిశు మందిర్ కు అందరశీ సహకరిస్తామని అన్నారు

జగిత్యాల జిల్లా శ్రీ సరస్వతీ శిశు మందిరం అభివృద్ధి, నూతన భవన నిర్మాణం కోసం గుర్రం సుదర్శన్ 5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) విరాళంగా



ప్రకటించడం ఎంతో ప్రశంసనీయం.

విద్యాసంస్థ అభివృద్ధిని కాంక్షిస్తూ, భావితరాల విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే సదుద్దేశంతో మీరు ప్రకటించిన ఈ మహత్తర విరాళం మా సంస్థకు ఎంతో స్ఫూర్తిదాయకం. మీ ఉదారత, విద్య పట్ల మీకున్న నిబద్ధత, సమాజం పట్ల మీకున్న బాధ్యతాభావం అభినందనీయమైనవి

మీ ఈ గొప్ప సహకారం ద్వారా శ్రీ సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణానికి మరింత ప్రోత్సాహం లభించడమే కాకుండా, భవిష్యత్తులో మరెందరో దాతలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాముఅని

ఈ సందర్భంగా గుర్రం సుదర్శన్కి ధన్యవాదాలు,మీకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, మీరు చేపట్టే ప్రతి కార్యంలో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

ఈ విరాళ ప్రకటన వివరాలను తెలియజేసిన శ్రీ సరస్వతీ శిశు మందిరం భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు బోడుగం మోహన్ రెడ్డి మామిడాల లక్ష్మీనారాయణలకు ధన్యవాదాలు.

"విద్యాదానం మహాదానం విద్యాసంస్థ అభివృద్ధికి మీ సహకారం అమూల్యం"

# బిల్లులపై 25 శాతం కమీషన్ అడిగి.. ఏసీబీకి చిక్కిన అధికారులు

జననాడి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ గుంజి అంకమ్మ రావు – అక్టోబర్ 23, 2026




ఏసీబీకి చిక్కిన పిఎంకెఎస్వై అధికారులు: భూపాలపల్లి జిల్లాలో ఇద్దరు పిఎంకెఎస్వై అధికారులు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.

భారీ బిల్లుల వ్యవహారంలో కమీషన్ డిమాండ్: రూ. 1.62 కోట్ల పనుల బిల్లుల మంజూరు వ్యవహారంలో ఏకంగా 25 శాతం కమీషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా సతీశ్ రెడ్డి, రాజు అనే కాంట్రాక్టర్ నుంచి రూ. 39 లక్షలు డిమాండ్ చేసినట్లు తేలింది. విసిగిపోయి ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్: పాలుమార్లు ఆన్‌లైన్‌లో వారి ఖాతాలకు నగదు బదిలీ జరిగినప్పటికీ, తాజాగా మరో రూ. 1.34 లక్షల బిల్లులోనూ కమీషన్ డిమాండ్ చేయడంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహించి తగిన చర్యలు చేపట్టారు

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపునకు మద్దతుగా నిలుస్తాం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**-డంపింగ్ యార్డు ఎత్తివేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని జేఏసీ వినతి.హైదరాబాద్ పరిసరాల్లో 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్**

జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత జేఏసీ పోరాట కమిటీ నాయకులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం, అక్టోబర్ 23న ఎమ్మెల్యేను కలిసిన జేఏసీ ప్రతినిధులు.. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చట్టసభల్లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా జేఏసీ పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి మాట్లాడుతూ.. గతంలో ఆటోనగర్ డంపింగ్ యార్డు సమస్యపై పోరాటం చేసిన నేతగా సుధీర్ రెడ్డికి గుర్తింపు



ఉందని తెలిపారు. ప్రస్తుతం మన్సూరాబాద్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన సమస్యపై కూడా ఆయన 20 కాలనీల్లో పర్యటించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా భూగర్భ జలాలు, గాలి, నీరు కలుషితమై మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని షేక్ షావలి ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలపక్షంలో భాగంగా సుధీర్ రెడ్డి సైతం ఈ సమస్య తీవ్రతను గుర్తించి ప్రస్తావించారని తెలిపారు. డంపింగ్ యార్డు తొలగింపునకు నిర్దిష్ట గడువు ప్రకటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరినట్లు వెల్లడించారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపు పోరాటానికి మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్తను అక్కడే నిర్వహించే విధంగా 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు సీపీఎం శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి చెందిన మహ్మద్ పాషామియా, టీవీఆర్ఎస్ మోనార్ దుర్గాప్రసాద్,చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపే సునీత, జర్నలిస్ట్ కొన్నె వేణు, టీయూసీఐ జి.లింగం తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ బరిలో టీడీపీ సీనియర్ నేత పుల్లయ్య...

## ఎస్టీ సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి...




విజయవాడ రూరల్ మండల జడ్పీటీసీ స్థానానికి పోటీ ఆసక్తికరంగా మారింది.జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీకి కేటాయించడంతో టీడీపీ సీనియర్ నాయకుడు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పింద్రాల పుల్లయ్య ఆశావహిగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు.మండలంలో తెలుగుదేశం పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న పుల్లయ్య.. పార్టీ అధిష్టానం తనకు అవకాశం కల్పిస్తుందనే ఆశతో నామినేషన్ వేసినట్లు తెలిపారు. జడ్పీటీసీ స్థానం జనరల్ కేటగిరీ కావడంతో పోటీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తనకు పార్టీ అధిష్టానం, నాయకులు అవకాశం కల్పించాలని కోరారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

ఫోటో రైటఅప్ : జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ సీనియర్ నాయకుడు పింద్రాల పుల్లయ్య.

# హైడ్రా, ఈగల్, టీజీ సేఫ్ ఏర్పాటు చేశాం: సీఎం రేవంత్



పోలీసుశాఖలో కీలక సంస్కరణలు: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరియు మెరుగైన పాలన అందించేందుకు పోలీసుశాఖలో అనేక సాహసోపేతమైన సంస్కరణలు తెచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మంచి సమాజం కోసం మార్పులు: ఒక మంచి సమాజం ఆవిర్భవించాలంటే పోలీసు వ్యవస్థలో కాలానికి తగిన మార్పులు, సంస్కరణలు ఎంతో అవసరమని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

దక్షిణాది రాష్ట్రాల సమన్వయ సమావేశం: శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బంజారాహిల్స్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు మరియు వివిధ ప్రముఖ దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించబడింది.

సీఎం రేవంత్ రెడ్డి హాజరు: ఈ అత్యున్నత స్థాయి సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణకు మరియు ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

# 36వ వార్డు లోని ఆజాద్ నగర్, వినాయక గుట్ట లో జరిగిన ఇంటింటి ప్రచారం

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాచర్ల పట్టణంలోని 36వ వార్డు అజాద్ నగర్, వినాయక గుట్ట నందు ఇంటింటికి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొనటం జరిగిందిని మిద్దెపోగు రాజేష్, జంపుల సాయి, 36 వార్డు జనసేన అజాద్ నగర్ వినాయకగుట్ట ఇన్చార్జ్ తెలియజేశారు.



# నీళ్లు, కరెంటు లేక ఎండిపోయిన పంట.. యువరైతు వినూత్న నిరసన (వీడియో)



సాగునీరు, విద్యుత్ లేక ఎండిపోయిన వరి పంట: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గొల్లపల్లి గ్రామంలో సాగునీరు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో, యువ రైతు ప్రవీణ్ తన మూడు ఎకరాల పొలంలో ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంట కళ్ళముందే ఎండిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

కళ్లముందే ఎండిన పంటతో తీవ్ర మనస్తాపం: పెట్టుబడి పెట్టి, అష్టకష్టాలు పడి పండించిన పంట నీరు అందక ఎండిపోవడాన్ని చూసి తట్టుకోలేకపోయిన ఆ యువరైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

ద్విచక్ర వాహనంతో పొలంలో వినూత్న నిరసన: అధికారుల నిర్లక్ష్యాన్ని, రైతుల కష్టాలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఆయన వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. తన ద్విచక్ర వాహనాన్ని (బైక్) ఎండిపోయిన పొలంలోనే తిప్పుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపి తన నిరసనను వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి నష్టపరిహారం డిమాండ్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆదుకోకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని, ఆత్మహత్యలే శరణమంటూ ఆయన కన్నీటిపర్యంతమయ్యారు.

# ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సల్పురం గ్రామపంచాయతీ ప్రజలకు కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచన

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచించారు. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వీరమల్ల రవిగౌడ్ మాట్లాడుతూ రైతులు పంటల సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. వర్షపాతం ఉష్ణోగ్రతల్లో మార్పులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు సలహాలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం



ఉంటుందని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రభావంకారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అందుబాటులోఉన్ననీటినిఅవసరాలకుఅనుగుణంగాప్రణాళికాబద్ధంగాఉపయోగించుకోవాలని సూచించారు. పంటల ఎంపిక విత్తనాల వినియోగం సాగు విధానాల విషయంలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ ప్రజలు వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వీరమల్ల రవిగౌడ్ కోరారు. రైతులు అనవసర ఆందోళనలకు గురికాకుండా శాస్త్రీయ పద్ధతులు మరియు నిపుణుల సలహాల ఆధారంగా వ్యవసాయ పనులు చేపట్టాలనిసూచించారు. రైతుల సంక్షేమం పంటల రక్షణకు ముందస్తు అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు వాతావరణ పరిస్థితులను బట్టి తగిన జాగ్రత్తలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ విజ్ఞప్తి చేశారు.

# పాడి గేదెల పంపిణీలో పక్షపాతమా?

– అర్హులైన పేదలందరికీ న్యాయం చేయాలి: టీఆర్ఎస్ నాయకుల వినతి

మధిర, అక్టోబర్ 23 జననాడి న్యూస్

మధిర: ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంలో పాడి గేదెల పంపిణీ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు ఇందిరా మహిళా డెయిరీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కల్పనకు వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో సుమారు 100 నుంచి 200 మంది పేద ప్రజల నుంచి పార్టీ భేదం లేకుండా ఒక్కొక్కరి వద్ద రూ. 2,100 చొప్పున వసూలు చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. అయితే పాడి గేదెల పంపిణీ సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ నిబంధనలు విధించడం వల్ల ఇతర పార్టీలకు చెందిన పేదలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.

ప్రజల నుంచి నగదు వసూలు చేసేటప్పుడు రాజకీయ భేదాలు చూడకుండా, లబ్ధిదారుల ఎంపికలో మాత్రం




పక్షపాతం చూపడం సమంజసం కాదన్నారు. అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా పాడి గేదెలు పంపిణీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో ఇదే విధమైన పక్షపాత ధోరణి కొనసాగితే టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# మా భూములు ముంచొద్దు మా నీళ్లు తీసుకపోవద్దు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోండి....

**- కల్వకుర్తి జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్**

**- పాలమూరు రైతుల పొట్టగొట్టేలా-డిండి ప్రాజెక్టు పేరుతో నీళ్ళ దోపిడీ**

**వార్తాలోకం / కల్వకుర్తి :**

పాలమూరు ఎదురుగుండా 300 కిలో మీటర్లు కృష్ణా నది ప్రవహిస్తున్న 80 ఏండ్లుగా పాలమూరు జిల్లా రైతాంగం సాగు,తాగు నీళ్ళు కోసం తండ్లాట పడుతుందని డిండి ప్రాజెక్టు పేరుతో మా భూములు ముంచొద్దు,మా నీళ్లు తీసుకపోవద్దు,మా రైతాంగం పొట్ట కొట్టొద్దని రైతు ఉద్యమ నాయకుడు కల్వకుర్తి జేఏసీ చైర్మన్ అయిల్ సదానందం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు మారుతున్నారు,ప్రభుత్వాలు మారుతున్నాయి,పాలకులు మారుతున్నారు. కానీ ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం బతుకులు మాత్రం మారడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలమూరు జిల్లాను కరువు జిల్లా, వలసల జిల్లాగా చేసి నీళ్ళ పంపిణీలో తీవ్రంగా అన్యాయం చేసింది. స్వరాష్ట్రంలో కూడా నల్లగొండ జిల్లా రాజకీయ నేతలు ఆధిపత్యంతో పాలమూరు రైతుల పొట్టగొట్టేలా డిండి ప్రాజెక్టు పేరుతో నీళ్ళ దోపిడికి తెరలేపారని ఆవేదన వ్యక్తం చేశారు.పాలమూరు జిల్లా రైతుల పక్షాన ఉద్యమించడానికి ఏ రాజకీయ పార్టీ కూడా ముందుకు రాలేని దుస్థితిల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులతో ఎర్రటి ఎండలో ధర్మ సత్యాగ్రహ దీక్ష,రైతుల మహా పాదయాత్ర,రైతాంగం మహాధర్నా కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్నికదిలించేలా చేశాయి అని పేర్కొన్నారు. ఉమ్మడిపాలమూరుజిల్లాఎమ్మెల్యేలు,మంత్రులు ,ఎంపీలను ఏకతాటిపైకి నిలపడం లో జేఏసీ సక్సెస్ అయింది.మనం చేసే పనిలో నీతి,నిజాయితీ,ధర్మం ఉంది కచ్చితంగా ప్రభుత్వం మన పాలమూరు జిల్లారైతాంగానికి న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

తక్షణమే డిండి ప్రాజెక్టు రద్దు చేసి,ఉమ్మడి పాలమూరు జిల్లారైతాంగానికి న్యాయం చేయాలన్నారు.

జిల్లాల మధ్యన జల వివాదాలు పరిష్కరించడం కోసం నల్లగొండ జిల్లా రైతాంగానికినాగార్జునసాగర్, శ్రీశైలం,గుర్రంపోడు, ఎస్సెల్బిసి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించి మునుగోడు,దేవరకొండ రైతాంగానికి నీళ్ళు ఇవ్వాలని కల్వకుర్తి జెఏసి చైర్మన్ సదానందం గౌడ్ సూచించారు.



# యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం.

జన నాడి న్యూస్ అక్టోబర్ 23:బి

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

# విజయనగరం జడ్పీ రేసులో కిమిడి.. చిన్న శ్రీనుకు మళ్లీ షాక్ తప్పదా?

**విజయవాడ, అక్టోబరు 23, పెన్ పవర్:** విజయనగరం జడ్పీ ఎన్నికలు ఆసక్తి రేపుతున్నాయి. ఈ పదవిని ఆశించి పార్టీలోకి వచ్చిన మాజీ జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనుకు రిజర్వేషన్ అనుకూలించపోగా, ఆయన కుమార్తె సిరి సహాస్రకు జిల్లా పరిషత్ అధ్యక్ష పీఠం దక్కుతుందా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. చిన్న శ్రీను కుటుంబానికి జడ్పీ సీటు ఇస్తామనే హామీతోనే టీడీపీలో చేర్చుకున్నారని ప్రచారం జరిగింది. ఇదే సమయంలో విజయనగరం మేయరుగా చిన్న శ్రీను కుమార్తె సిరిసహస్ర పోటీ చేస్తారని ఊహాగానాలు వ్యాపించాయి. అయితే విజయనగరంలో సిరిసహస్రకు ఓటు లేకపోవడం వల్ల ఆమె జడ్పీ రేసులోకి వచ్చారని చెబుతున్నారు. అయితే ఇప్పుడు సిరిసహస్రకు పోటీగా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోడలు సంధ్య రంగంలోకి దిగడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. విజయనగరం జిల్లా పరిషత్ అధ్యక్ష పదవిపై మాజీ చైర్మన్ చిన్న శ్రీనుకు మోజు ఎక్కువని చెబుతారు. రాజకీయంగా ఆ కుటుంబానికి ఎన్ని పదవులు ఉన్నప్పటికీ జిల్లా పరిషత్ చైర్మన్ సీటు కావాలని పట్టుబడుతుంటారని చెబుతున్నారు. రిజర్వేషన్ అనుకూలించినా, లేకపోయినా జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా ఎవరు ఉన్నా, తెరవెనుక పెద్దరికం అంతా చిన్న శ్రీనే చేసేశారన్న విమర్శలు ఉన్నాయి. 2006 నుంచి ఇప్పటివరకు జడ్పీపై చిన్నశ్రీను పెద్దరికమే నడిచిందని అంటున్నారు. 2014 – 19 మధ్య కాలంలో తప్ప మిగిలిన సమయంలో కాంగ్రెస్, వైసీపీ పార్టీలకు చెందిన నాయకులే జిల్లా పరిషత్ చైర్మన్లుగా పనిచేయడం, ఆ సమయంలో చిన్న శ్రీను ఆ పార్టీలో కీలకంగా ఉండటంతో జడ్పీ పగ్గాలు తన చేతిలో ఉంచుకునేవారని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో 2021 ఎన్నికల్లో ఆయనే స్వయంగా పోటీ చేసి చైర్మను పీఠం అధిష్టించారు. ఇక తాజా ఎన్నికల్లో మరోసారి ఈ సీటు ఆశించినా రిజర్వేషన్ అనుకూలించలేదని చెబుతున్నారు. దీంతో తన కుమార్తె సిరిసహస్రను తెర్లాం జడ్పీటీసీగా పోటీకి పెట్టారని అంటున్నారు. అయితే జిల్లా రాజకీయాల్లో ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే చిన్న శ్రీను ఆశలు నెరవేరే పరిస్థితి ఉందా? అన్న చర్చే ఎక్కువగా నడుస్తోంది. చిన్నశ్రీను తన కుమార్తెను ఎవరూ ఊహించని విధంగా బొబ్బిలి నియోజకవర్గం నుంచి బరిలోకి దింపగా, ఆయనకు పోటీగా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి



కళావెంకటరావు తన కోడలు సంధ్యను పోటీకి పెట్టినట్లుగా ప్రచారం జరుగుతోంది. చిన్నశ్రీను సొంత నియోజకవర్గంగా భావిస్తున్న చీపురుపల్లితోపాటు రాజాం అసెంబ్లీ నియోజకవర్గాల్లో కిమిడి కళావెంకటరావు ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో ఆయన కోడలు సంధ్య జిల్లా అధ్యక్ష పదవికి హాట్ ఫేవరెట్ అంటూ ప్రచారం జరుగుతోంది. పార్టీలో సీనియర్ కావడం, మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల జడ్పీ పీఠం కోసం కళా ఒత్తిడి చేసే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో చిన్న శ్రీను కుమార్తె పేరు సందిగ్ధంలో పడుతోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**భారీగా పోటీ**

విజయనగరం జిల్లాలో ఈ సారి జడ్పీ చైర్మన్ పోస్టును చాలా మంది నేతలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయం ఏ విధంగా ఉంటుందనే ఉత్కంఠ ఎక్కువ అవుతోంది. ప్రధానంగా మాజీ చైర్మను చిన్న శ్రీను కుమార్తెకు ఈ పదవి ఇస్తారని తొలి నుంచి ప్రచారం జరిగినా, ప్రస్తుతం జిల్లా నుంచి పలువురు సీనియర్లు తమ కుటుంబ సభ్యులతో నామినేషన్లు వేయడంతో గందరగోళం నెలకొంది. ముఖ్యంగా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోడలు నామినేషన్ వేయడంతో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారుతున్నాయని అంటున్నారు. ఇదే సమయంలో మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు తన కుమార్తె చంద్రకళతో నామినేషన్ వేయించడం కూడా చర్చకు తావిస్తోంది. నెల్లిమర్ల ఎమ్మెల్యే టికెట్ ఆశించిన బంగార్రాజు పొత్తుల్లో భాగంగా త్యాగం చేయడంతో జడ్పీ చైర్మన్ సీటు ఆశిస్తున్నట్లుగా చెబుతున్నారు. మరోవైపు నెల్లిమర్ల నియోజకవర్గానికే చెందిన మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్ భార్య కంది రమాదేవి సైతం చైర్పర్సన్ సీటు ఆశించడంతో ఉత్కంఠ పెరుగుతోంది. కంది చంద్రశేఖర్ గత ఎన్నికల్లో విజయనగరం లోక్ సభ సభ్యుడిగా పోటీకి సిద్ధమవగా, చివరి క్షణంలో అధిష్టానం తప్పించిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనే సస్పెన్స్ ఎక్కువవుతోంది.

# ఇది బొత్స బ్రాండ్.. జడ్పీ ఎన్నికల్లో నలుగురు కుటుంబ సభ్యులకు టికెట్లు!



**విజయవాడ, అక్టోబరు 23, పెన్ పవర్:** విపక్షం వైసీపీలో తనకు తిరుగు లేదని సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మరోసారి నిరూపించుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంత కుటుంబం నుంచి నలుగురిని జడ్పీటీసీలుగా బరిలోకి దింపారు. బొత్స కుమార్తె అనూషతోపాటు కోడలు పూజిత, చెల్లెలు లక్ష్మి, తమ్ముడి కుమారుడు చైతన్య నాలుగు వేర్వేరు మండలాల నుంచి జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు వేయడం హాట్ టాపిక్ అవుతోంది. జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా తన కుమార్తె అనూష ఉంటుందని బొత్స ఇదివరకే ప్రకటించారు. ఈ ప్రకటన ఆయన కుటుంబంలో తీవ్ర దుమారం రేపింది. అయినప్పటికీ ఆ ప్రకటనకు కట్టుబడి ఉన్నట్లే బొత్స సంకేతాలు పంపుతున్నారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం బలంగా ఉన్న సమయంలో రాజకీయంగా ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ విజయనగరం జిల్లాలో గెలిచి తీరుతామని బొత్స ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీ శ్రేణులలో ధైర్యం నింపేందుకు తన కుటుంబ సభ్యులనే ముందుకు తెచ్చారని అంటున్నారు.

జడ్పీ ఎన్నికల్లో బొత్స కుటుంబం నుంచి నలుగురు ఒకేసారి పోటీ చేయడం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. జిల్లాలో మొత్తం 27 మండలాలు ఉండగా, బొత్స మూడు నియోజకవర్గాల పరిధిలో నాలుగు చోట్ల తన కుటుంబ సభ్యులను పోటీకి పెట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. తన సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో గరివిడి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా కోడలు పూజితను పోటీకి పెట్టారు. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా సీనియర్ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోడలు సంధ్య పోటీ చేస్తున్నారు. దీంతో గరివిడి జడ్పీటీసీ ఎన్నిక వేడి పుట్టిస్తోంది. మరోవైపు బొత్స చెల్లెలు లక్ష్మిని కూడా సొంత నియోజకవర్గంలోని గుర్ల నుంచి పోటీకి పెట్టారు బొత్స. దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా బొత్స పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉండగా, అందులో రెండు చోట్ల తన కుటుంబ సభ్యులను పోటీకి పెట్టడం ద్వారా, ఇటీవల టీడీపీలో చేరిన తన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ చెప్పేలా బొత్స వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని విశ్లేషిస్తున్నారు.

ఇక బొత్స తమ్ముడు కుమారుడు చైతన్య నెల్లిమర్ల మండలంలోని పూసపాటిరేగ జడ్పీటీసీగా పోటీ చేస్తున్నారు. ఈయన చాలాకాలంగా నెల్లిమర్ల నియోజకవర్గంపై దృష్టిపెట్టారు. అక్కడ ఇన్నాళ్లు తమ కుటుంబానికే చెందిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కారణంగా చైతన్య వెనక్కి తగ్గాల్సివచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం బడ్డుకొండ వైసీపీ నుంచి బయటకు వెళ్లిపోవడంతో చైతన్యకు లైన్ క్లియర్ అయిందని అంటున్నారు. మరోవైపు ఇటీవల భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జిగా బాధ్యతలు తీసుకున్న బొత్స కుమార్తె అనూష సైతం జడ్పీటీసీ ఎన్నికల బరిలో దిగడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వాస్తవానికి అనూష జడ్పీ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారని బొత్స గత ఆగస్టులోనే ప్రకటించారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడో ఒక చోట ఆమెను బరిలోకి దించి గెలిపించాలని భావించారని చెబుతున్నారు. అయితే ఇప్పుడు మాజీ జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను పార్టీ మారడం, ఆయన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న అనుమానంతో అనూషను గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి నుంచి పోటీకి పెట్టినట్లుగా పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విధంగా కుటుంబం నుంచి నలుగురిని పోటీకి పెట్టిన బొత్స వైసీపీలో తన నిర్ణయమే ఫైనల్ అన్న సంకేతాలను మరోసారి పంపారని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బొత్స నిర్ణయాన్ని వ్యతిరేకించలేని వాతావరణం కూడా ఉండటం ఆయనకు కలిసివచ్చిందని అంటున్నారు. నిజానికి బొత్స ఏ పార్టీలో ఉన్నప్పటికీ తన కుటుంబ సభ్యులకు అధిక ప్రాధాన్యం ఇస్తారని చెబుతుంటారు. గతంలో కాంగ్రెస్ లో పనిచేసినప్పుడు కానీ, ప్రస్తుతం వైసీపీలో బొత్స కుటుంబానికి చెందిన ముగ్గురు లేదా నలుగురికి చట్టసభలకు పోటీ చేసే అవకాశం దక్కేది 2024 ఎన్నికల్లో మొత్తం నలుగురు పోటీ చేయగా, అందరూ ఓడిపోయారు. అయినప్పటికీ పార్టీలో ఆయన ప్రభావం ఏ మాత్రం తగ్గలేదని నిరూపించేలా ప్రస్తుతం నలుగురు కుటుంబ సభ్యులను పోటీకి పెట్టడాన్ని చూపుతున్నారు.

# ఒక్క వార్నింగ్ తో నేతల తిప్పలు

**తిరుపతి, అక్టోబరు 23, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ చేసిన వ్యూహాత్మక తప్పిదమే ఇప్పుడు ఈ ఘర్షణలకు కారణమవుతున్నాయి. ఆయన పోటీ చేయాలని ఒక్క పిలుపు ఇచ్చి ఊరుకుంటే సరిపోయేది. ఏకగ్రీవమయితే వచ్చేఎన్నికల్లో టిక్కెట్లు కూడా దక్కవని ఇచ్చిన వార్నింగ్ తోనే కూటమి నేతలు అప్రమత్తమయ్యారని వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పార్టీ నాయకులను హెచ్చరిస్తూ చేసిన వ్యాఖ్యలు మరియు ప్రస్తుత రాజకీయ పరిణామాలు రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారితీశాయి. జగన్ వ్యూహం తప్పుగా మారిందా లేదా అనే అంశంపై రాజకీయవర్గాల్లో భిన్నమైన విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మౌనంగా ఉండి పోటీ చేయాలని మాత్రమే చెప్పి ఉంటే ఇంతటి ఉద్రిక్తతలు నెలకొని ఉండేవి కావన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఎన్నికల షెడ్యూల్‌విడుదలకు ముందు జరిగిన పార్టీ సమావేశాలలో జగన్ మోహన్ రెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు మరియు నేతలకు “స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలు జరగడానికి వీల్లేదు” అని కఠినమైన వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ ఏదైనా స్థానంలో పోటీ పెట్టకుండా కూటమి అభ్యర్థుల ఏకగ్రీవానికి సహకరిస్తే, ఆ ఇన్‌చార్జ్‌లకు భవిష్యత్తులో ఎమ్మెల్యే సీట్లు కూడా ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణుల్లోధైర్యం నింపేందుకు మరియు ప్రతి సీటులోనూ పోటీ గట్టిగా ఉండాలనే ఉద్దేశంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో నియోజకవర్గాల ఇన్ ఛార్జులు తెగించి మరీ బరిలోకి దిగారు. దీంతో దాడులు –ప్రతి దాడులుజరిగాయి. అదే సమయంలో కూటమి నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అసలు నామినేషన్లు వేయకుండా అడ్డుకుని అధికారంలో తాము ఉన్నామని జగన్ కు గుర్తు చేసినట్లయింది. ఇది సాధారణ ఎన్నికలు కావన్నది జగన్ విస్మరించారు. జగన్ హెచ్చరికల అనంతరం పులివెందుల, పుంగనూరు, రాయచోటి, మైదుకూరు వంటి వైసీపీకి బలమైన కోటలుగా ఉన్న ప్రాంతాలలో సైతం పలు మున్సిపాలిటీలు, వార్డులు కూటమి పరమవబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనికి విశ్లేషకులు చెప్తున్న ప్రధాన కారణాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల ఖర్చంతా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మరియుఅభ్యర్థులే భరించాలని, పార్టీ నుండి ఎలాంటి ప్రత్యేక ఆర్థిక సహాయం ఉండదని జగన్ ముందే తేల్చిచెప్పడం వల్ల చాలామంది కొంత నిరాశలో పడ్డారు. తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనీయకుండాకూటమి ప్రభుత్వం, పోలీసులు అడ్డుకున్నారని, నామినేషన్ పత్రాలను చింపేస్తూ అరాచకాలకు పాల్పడ్డారని జగన్ స్వయంగా ఆరోపించారు. దీనిపై ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మరియు గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో జరిగిన గొడవలు మరియు అభ్యర్థులను అడ్డుకున్న అంశాలపై వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించింది. అయితే ఇంతకీ జగన్ సాధించిందేందన్నప్రశ్న మాత్రం నేతల్లో వ్యక్తమవుతుంది

**మారని నేతల తీరు**

పరిషత్ ఎన్నికల్లో తీరు మారలేదు. హింసాత్మక ఘటనలు జరిగాయి. అనేక చోట్ల నామినేషన్ల పత్రాలను ప్రత్యర్థుల నుంచి తీసుకుని చించేశారు. పోలీసులు చేతులెత్తేశారు. ఇలాంటి ఘటనలు కూడా ఎక్కువరాయలసీమలోనే జరిగాయి. కడప జిల్లాలో నిన్న పరిషత్ ఎన్నికలకు సంబంధించి ఒక్క నామినేషన్ కూడా వేయలేక పోయింది. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జడ్పీ ఎన్నికల్లోనూ అదే తీరు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. టీడీపీ, వైసీపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నా ఎన్నికల ప్రక్రియ పూర్తిగా అపహాస్యానికిలోనయిందనే చెప్పాలి. సుప్రీంకోర్టు ఆదేశాలు కూడా పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలకు టీడీపీ నేతలు తీవ్రంగా స్పందించారు. వైసీపీ నేతలే దాడులకు తమపైకి దిగుతూ ఎదురుదాడికిదిగుతు న్నారని అంటున్నారు కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ఎన్నికల సమయంలో ముఖ్యంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం లేదా బలవంతపుఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తుంటాయి. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగాలని మరియు హింసకు తావులేకుండా చూడాలని ఉన్నతన్యాయస్థానాలు ఆదేశించినప్పటికీ,ద

క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. పోలీసులు అభ్యర్థులకు భద్రత కల్పించాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. కడప, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి, మార్కాపురం, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు మరోసారి ప్రజలను నివ్వెర పర్చేలా చేశాయి. ఆంధ్రప్రదేశ్ లో రెండు పార్టీల కార్యకర్తలు బాహాబాహీకిదిగుతుండటంతో పోలీసులు కూడా అదుపు చేయలేకపోతున్నారు. సిబ్బంది కొరత కూడా ఇబ్బందిగా మారిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలనామినేషన్ల స్వీకరణ నిన్న ప్రారంభమయినా పలుచోట్ల ఉద్రిక్తతలు, ఘర్షణల మధ్య హింసాత్మకంగా ప్రారంభమైంది. అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య పలు జిల్లాల్లో తీవ్రఘర్షణలు చోటుచేసుకున్నాయి. నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో హింస జరుగుతోందంటూ వైఎస్సార్సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పైసుప్రీంకోర్టు నిన్న కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థుల ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైతే నామినేషన్ల గడువును 48 గంటల పాటు పొడిగించేలా నిర్ణయంతీసుకోవాలని ఏపీ ఎన్నికల సంఘానికి సూచించింది. అభ్యర్థులు నేరుగా జిల్లా కలెక్టర్ల వద్ద కూడా నామినేషన్లు సమర్పించేలా చర్యలు చేపట్టాలని పేర్కొంది. ఈ గొడవల నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితావిడుదలను కోర్టు అక్టోబర్ 25 వరకు పొడిగించింది

# కోటియాలో కొత్త పంచాయితీ

**శ్రీకాకుళం, అక్టోబరు 23, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ – ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లోని కోటియా సరిహద్దు పంచాయతీ సరికొత్త రాజకీయ, సామాజిక ఆందోళనలకు వేదికగా మారింది. కోటియా పరిధిలోని గ్రామాల్లో ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘంఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతున్నట్లు చేసిన ప్రకటనతో సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఒడిశాకు చెందిన పలు రాజకీయ పార్టీలు, స్థానిక గిరిజన సంఘాలు ఏపీ ప్రభుత్వ చర్యలనునిరసిస్తూ ఆంధ్రా గో బ్యాక్ నినాదాలతో హోరెత్తిస్తున్నాయి. ఈ పరిణామంపై ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోనిఎన్డీయే ప్రభుత్వ మనుగడకు ఏపీలోని చంద్రబాబు నాయకత్వంలోని అధికార టీడీపీ మద్దతు కీలకంగా మారడం వల్లే, ఒడిశాలోని ప్రస్తుత బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్ర సార్వభౌమత్వాన్ని తాకట్టుపెడుతూ మౌనం వహిస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. అసలు ఈ సరిహద్దు పోరుకు మూలాలు స్వాతంత్ర్యానికి పూర్వమే బలంగా పడ్డాయి. 1936లో దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఒడిశాఏర్పాటైనప్పుడు.. పూర్వపు జైపూర్ జమీందారీ, కొరాపుట్ పరిధిలోని పొట్టంగి తాలూకా కింద ఉన్న కోటియా ప్రాంతం తమదేనని ఒడిశా ప్రతిపాదిస్తోంది. అయితే, 1953లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచివిడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన సమయం నుంచి.. 28 గ్రామాలున్న ఈ కోటియా పంచాయతీలోని 21 గ్రామాలు తమ పరిధిలోని విజయనగరం ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు తాలూకాకిందకే వస్తాయని ఆంధ్రప్రదేశ్ బలంగా వాదిస్తోంది. ఈ వివాదం దశాబ్దాలుగా తేలకపోవడంతో 1968లోనే ఇరు రాష్ట్రాలు సుప్రంకోర్టు గడప తొక్కాల్సి వచ్చింది. క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలిస్తే.. కోటియాగ్రామాలపై ఆంధ్రప్రదేశ్ మొదటి నుంచీ పక్కా అధికారిక , ల్యాండ్ రికార్డుల ఆధారాలతో వాదిస్తూ వస్తోంది. ఈ గ్రామాల్లో నివసించే మెజారిటీ ప్రజలు తెలుగు భాషతో పాటు స్థానిక గిరిజన మాండలికాలుమాట్లాడటం ఏపీకి సానుకూలాంశంగా మారింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏపీ అధికారికంగా వారికి రేషన్ కార్డులు, ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు ఇస్తూ, విద్యుత్, రహదారుల నిర్మాణంతో పాటుసంక్షేమ పథకాలను చేరవేస్తోంది. సాలూరు అసెంబ్లీ, అరకు లోక్‌సభ స్థానాల పరిధిలోనే ఓటింగ్ నిర్వహిస్తోంది. ప్రజాస్వామ్యంలో స్థానిక గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కాపాడటం రాజ్యాంగబద్ధమైనబాధ్యతని ఏపీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. 1968లో దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఇరు రాష్ట్రాలను యథాతథ స్థితి పాటించాలని ఆదేశించింది. అనంతరం 2006లో తుదిర్పునిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుల విభజన అంశం న్యాయస్థానాల పరిధిలోనిది కాదని, పార్లమెంట్ మాత్రమే చట్టం ద్వారా తేల్చాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ, 2021లో ఏపీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించగా ఒడిశా సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేసింది. ఆ తర్వాత ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలు, సంయుక్తకమిటీల ఏర్పాటు , ఇటీవల ఒడిశా నియమించిన 16 మంది సభ్యుల కోటియా కమిటీ అధ్యయనాలు జరిగినప్పటికీ సమస్య మాత్రం మొదటికొచ్చింది. ప్రస్తుతం కోటియా పంచాయతీ గిరిజనుల జీవితంరెండు రాష్ట్రాల ద్వంద్వ పాలన మధ్య నలిగిపోతోంది. ఇక్కడి ప్రజలు ఏపీ, ఒడిశా రెండు ప్రభుత్వాల నుంచి రేషన్, పింఛన్లు, ఇళ్లు పొందుతూ రెండు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఓట్లు వేస్తున్నారు. ఒకరి కంటేమరొకరు ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తామంటూ ఇరు రాష్ట్రాల అధికారులు పోటీ పడుతున్నప్పటికీ, సరిహద్దు వివాదం వల్ల శాశ్వత అభివృద్ధి పనులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ఇక్కడమూలపడిపోతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఈ సెంటిమెంట్‌ను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం పరిపాటిగా మారింది. రాజకీయ విమర్శలు, ప్రాంతీయ సెంటిమెంట్లను పక్కనబెట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది.

# వైసీపీకి అనుకూలంగా ఎబీవీ...




**విజయవాడ, అక్టోబరు 23, పెన్ పవర్:** మాజీ ఐపీఎస్ అధికారి ఏ బి వెంకటేశ్వరరావు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఇటీవల కాలంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు చర్చకు దారి తీస్తున్నాయి. సీనియర్ అధికారిగా ఆయనకు ప్రజా సమస్యల మీద అవగాహన ఉంది. కాకపోతే ఆయన మాట్లాడుతున్న తీరు విచిత్రంగా.. విడ్డూరంగా ఉంది. ఒక ముక్కలో చెప్పాలంటే ఆయన ప్రకటించిన పార్టీ.. వ్యవహరిస్తున్న తీరు అచ్చం ఫ్యాన్ పార్టీ తరహాలోనే ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ మేయర్ పదవికి ఆయన బరిలోకి దిగారు. ఇది సమయంలో అవకాశం దొరికిన ప్రతి సందర్భంలో మీడియా ముందు మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడుతున్న మాటలు ఆయన వ్యక్తిత్వాన్ని మరో విధంగా చూపిస్తున్నాయి. వాస్తవానికి విలేకరుల సమావేశంలో చాలా హుందాగా మాట్లాడాల్సిన ఆయన.. తన స్థాయిని తగ్గించుకొని మాట్లాడారు. ఇప్పటివరకు ఒక విశ్రాంతి అధికారిగా ఆయనకు ప్రజల్లో ఉన్న గౌరవం కాస్త తగ్గిపోయింది..ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబడిన ఆయన తన భాషను.. తన బాడి లాంగ్వేజ్ ను పూర్తిగా వైసిపికి అనుకూలంగా ప్రదర్శించడం విశేషం. ఒకరకంగా ఆయన మాట్లాడుతున్న ప్రతి మాట తాడేపల్లి ప్యాలస్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ లాగా ఉంది. వైసిపి నాయకులకు ప్రతి సందర్భంలోనూ చంద్రబాబును కించపరచడం అలవాటు. చంద్రబాబు ప్రస్తావన లేకుండా వారు మాట్లాడారు.. ఏబీ వెంకటేశ్వరరావు కూడా అలానే మాట్లాడడం విశేషం. అప్పట్లో వర్షాలు వచ్చినప్పుడు చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని.. ఆ సమయంలో ఆయన బస్సులో ఉన్నారట. వాస్తవానికి వర్షాలు వచ్చినప్పుడు చంద్రబాబు ఇల్లు మునిగిపోలేదు. పైగా వరదలు చోటు చేసుకున్నప్పుడు అందరితోపాటు చంద్రబాబు కూడా బస్సులో ఉన్నారు. ఇలాంటి మాటలు వైసీపీ నాయకులు మాట్లాడుతారు. కాకపోతే ఏబీ వెంకటేశ్వరరావు వైసీపీకి నాయకులను మించిన స్థాయిలో మాట్లాడటం విశేషం. ఇక స్థానిక సంస్థ ఎన్నికలకు సంబంధించి వైసిపి సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. సుప్రీంకోర్టు తీర్పును వక్రీకరించింది. అయితే వైసిపి తన రాజకీయాలకు అనుకూలంగా మైండ్ గేమ్ ఆడింది. అయితే వైసీపీ చేసిన ట్వీట్ లను ఏబీ వెంకటేశ్వరరావు తన ఖాతాలో రీ ట్వీట్ చేయడం విశేషం. రాజకీయాల్లో ఎవరికైనా సరే ఒక గెస్ట్ ఆఫ్ హానర్ అనేది ఉంటుంది. దాని ప్రదర్శించాలి కూడా. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ బి వెంకటేశ్వరరావు ను సర్వీస్ నుంచి సస్పెండ్ చేసింది. పెన్షన్ నిలిపివేసింది. తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టింది. ఆ సమయంలో ఆయనకు టిడిపి అండగా నిలిచింది. న్యాయపోరాటం జరుగుతున్నప్పుడు నైతిక స్థయిర్యాన్ని అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఏబీ వెంకటేశ్వరరావు సర్వీసు వివాదాలను పరిష్కరించింది. బకాయిలను విప్పించింది. ఆయన స్థాయికి తగ్గట్టుగా నామినేటెడ్ పోస్ట్ కూడా ఇచ్చింది.. అయితే ఇంతటితో ఏబి వెంకటేశ్వరరావు సంతృప్తి పడలేదు. అధికార దాహం ఆయనను నిలవనీయలేదు. పైగా అత్యాశతో ఆయన ఇంకా పెద్ద పదవి కావాలని కోరుకున్నారు. నామినేటెడ్ పదవిని కూడా వదులుకొని చివరికి ఇలా స్థాయిని తగ్గించుకున్నారు. నమ్మిన వారికి వెన్నుపోటు పొడిచే విధానాన్ని ఆయన అడుగడుగునా చాటుకుంటున్నారు..ఇక ఏ బి గతాన్ని ఒకసారి పరిశీలిస్తే.. చంద్రబాబును రాజకీయంగా ఇబ్బంది పెట్టే వ్యవహారాలను అనేకం సాగించారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రానికి సంబంధించి ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఏబీ ఉన్నారు. ఆ సమయంలో వివేకానంద రెడ్డి హత్య కేసు జరిగినప్పుడు.. ఎలాంటి ఇంటలిజెన్స్ ఉపయోగించారు ఇప్పటికే తెలియదు. నాటి ఘటనను గుండెపోటుగా చిత్రీకరించి వైసిపి ఆడిన పొలిటికల్ గేమ్ ను అంచనా వేయడంలో ఏబి అట్టర్ క్లాస్ అయ్యారు. ఆయన నిర్లక్ష్యం వల్ల చంద్రబాబు తలవంచుకోవలసి వచ్చింది. డిఫెన్స్ మోడ్ లో పడాల్సి వచ్చింది. అయినప్పటికీ చంద్రబాబు ఎటువంటి కక్ష సాధింపులకు దిగలేదు. ఏబి కి అగ్ర తాంబూలం అందించారు. అటువంటి ఏబి ఇప్పుడు పొలిటికల్ లబ్ధి కోసం చంద్రబాబు ప్రభుత్వం మీద ఈ స్థాయిలో విషం చిమ్మడం విశేషం.

# 300వ టీ20 మైలురాయిపై భారత్ గురి.. సూర్యవంశీ రీఎంట్రీపై ఉత్కంఠ!



టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ మరో రికార్డు ముంగిట నిలిచింది. న్యూజిలాండ్‌తో రేపు జరిగే రెండో టీ20లో బరిలోకి దిగడం ద్వారా టీమిండియా 300 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా చరిత్ర సృష్టించనుంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తిరిగి తుది జట్టులోకి వస్తాడా? అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేయాలని చూస్తోంది. తొలి టీ20లో ఇదే హాగ్లీ ఓవల్ మైదానంలో భారీ లక్ష్యాన్ని ఛేదించి గెలిచిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

**సూర్యవంశీకి అవకాశం దక్కేనా?**

తొలి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన భారత జట్టులో బ్యాటర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్ కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ టీ20ల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. అయితే రెండో మ్యాచ్‌కు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరమయ్యాడు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్ ఆడటం లేదు. దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే వీలుంది. అప్పుడు సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తుది జట్టు కూర్పుపై భారత జట్టు యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**అదే పిచ్.. బౌలర్లకు సవాలే!**

తొలి టీ20లో రెండు జట్లూ కలిసి భారీగా పరుగులు సాధించడంతో మరోసారి బ్యాటర్ల ఆధిపత్యం కనిపిస్తుందా? అన్న చర్చ సాగుతోంది. అదే మైదానం, అదే పిచ్‌పై మ్యాచ్ జరగనుండటంతో పరిస్థితులు బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఒక మ్యాచ్ జరగడంతో పిచ్‌పై అరిగిపోయిన భాగాలు బౌలర్లకు కొంత సహకరించవచ్చని తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్.. చివరి వరకు పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయింది. ఈసారి బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని కివీస్ భావిస్తోంది. వరుసగా రెండో ఓటమి ఎదురైతే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి పుంజుకోవడం ఆ జట్టుకు కష్టమవుతుంది. ముఖ్యంగా భారత టాప్ ఆర్డర్‌ను త్వరగా కట్టడి చేయడం న్యూజిలాండ్‌కు కీలకం కానుంది.

**300వ మ్యాచ్‌లో భారత్ రికార్డు ఏంటి?**

అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకు 299 మ్యాచ్‌లు ఆడిన భారత్.. 300వ మ్యాచ్‌తో ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా నిలవనుంది. పాకిస్థాన్ 304 మ్యాచ్‌లతో ఈ జాబితాలో ముందుంది. టీమిండియా ఇప్పటివరకు 199 మ్యాచ్‌ల్లో సాధారణ విజయాలు నమోదు చేయగా, సూపర్ ఓవర్, బౌల్ అవుట్ ద్వారా వచ్చిన విజయాలను కలుపుకొని మొత్తం 205 విజయాలు సాధించింది. ఈ చారిత్రక మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ పట్టుదలగా ఉంది. మరోవైపు స్వదేశంలో సిరీస్‌ను సమం చేయాలంటే న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ కీలకం. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటాయి.

# వడోదరలో శ్రీ చరణి స్పిన్ మాయ.. 197 పరుగులకే జింబాబ్వే ఆలౌట్




జింబాబ్వేతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో ప్రపంచ ఛాంపియన్ భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. వడోదర సమీపంలోని కోటంబిలో ఉన్న బీసీఏ స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో భారత బౌలర్లు చెలరేగడంతో జింబాబ్వే జట్టు 49.5 ఓవర్లలో 197 పరుగులకే ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్ శ్రీ చరణి కేవలం 23 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి జింబాబ్వే పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే ఓపెనర్ లోరిన్ ఫిరిని క్రాంతి గౌడ్ తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టి పెవిలియన్ పంపింది. అదే ఓవర్‌లో మరో వికెట్ తీసే అవకాశం భారత్‌కు లభించినా, వికెట్ కీపర్ రిచా ఘోష్ క్యాచ్ జారవిడవడంతో చిపో ముగేరి-తిరిపానో బతికిపోయింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముగేరి, మరో ఓపెనర్ మోడెస్టర్ ముపాచిక్వా కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పవర్‌ప్లే ముగిసేసరికి జింబాబ్వే వికెట్ నష్టానికి 46 పరుగులు చేసింది.పవర్‌ప్లే తర్వాత కెప్టెన్ స్మృతి మంధాన బంతిని స్పిన్నర్ శ్రీ చరణికి అందించడం సత్ఫలితాలను ఇచ్చింది. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ చరణి తన తొలి ఓవర్లోనే 21 పరుగులు చేసిన ముగేరి-తిరిపానోను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపింది. ఆ తర్వాత తన తర్వాతి ఓవర్లోనే 25 పరుగులు చేసి ప్రమాదకరంగా మారుతున్న మరో ఓపెనర్ ముపాచిక్వాను కూడా గౌడ్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చింది. దీంతో జింబాబ్వే కష్టాల్లో పడింది. కాసేపటికే దీప్తి శర్మ బౌలింగ్‌లో షార్న్ మేయర్స్ (8) కూడా ఔట్ కావడంతో జింబాబ్వే స్కోరు వేగం మందగించింది.ఈ దశలో బెలోవ్డ్ బిజా, న్యాషా గ్వాంజురా కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ జంట వికెట్ల పతనాన్ని అడ్డుకుని స్కోరు బోర్డును ముందుకు నడిపించింది. ఈ భాగస్వామ్యాన్ని కూడా శ్రీ చరణియే విడదీసింది. 13 పరుగులు చేసిన గ్వాంజురాను రిటర్న్ క్యాచ్ ద్వారా ఔట్ చేసింది. అయినప్పటికీ, బెలోవ్డ్ బిజా ఒంటరి పోరాటం కొనసాగించింది. మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా పట్టుదలగా ఆడి 64 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకుంది. మిచెల్ మవుంగా (29) చివర్లో కొన్ని దూకుడైన షాట్లు ఆడి స్కోరును పెంచే ప్రయత్నం చేసినా, ఆమెను ఔట్ చేయడం ద్వారా శ్రీ చరణి తన నాలుగో వికెట్‌ను ఖాతాలో వేసుకుంది.

చివరకు బెలోవ్డ్ బిజా 92 బంతుల్లో 4 ఫోర్లతో 62 పరుగులు చేసి జట్టు టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఆమెను క్రాంతి గౌడ్ ఔట్ చేసింది. ఇన్నింగ్స్ చివరి బంతికి ముందు టెండయ్ మకుషాను దీప్తి శర్మ బౌల్డ్ చేయడంతో జింబాబ్వే 197 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో శ్రీ చరణి 4 వికెట్లు తీయగా, క్రాంతి గౌడ్ 3, దీప్తి శర్మ 2, షఫాలీ వర్మ ఒక వికెట్ పడగొట్టారు.

# కోహ్లీ మాట నమ్మా, కానీ మోసం చేశాడు.. అందుకే రిటైర్మెంట్ ఇచ్చేశాను: అమిత్ మిశ్రా



భారత క్రికెట్ వర్గాలలో ప్రస్తుతం ఒక సంచలన వార్త తీవ్ర చర్చనీయాంశమైంది. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కారణంగానే తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ అర్ధాంతరంగా ముగిసిపోయిందని మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా సంచలన ఆరోపణలు చేశారు. భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా నిర్వహించిన పాడ్‌కాస్ట్ బేత్ అండ్ బోల్ లో మిశ్రా పాల్గొని తన కెరీర్‌కు సంబంధించిన పలు జ్ఞాపకాలను, ఆసక్తికర విషయాలని పంచుకున్నారు.

**గాయం సమయంలో కుంబ్లే, కోహ్లీ భరోసా:**

అమిత్ మిశ్రా తన కెరీర్ ముగింపు గురించి మాట్లాడుతూ.. 2017లో ఇంగ్లాండ్‌తో బెంగళూరులో జరిగిన టీ20 మ్యాచ్‌నే తాను భారత్ తరఫున ఆడిన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని పేర్కొన్నారు. ఆ మ్యాచ్‌లో గాయపడకపోతే తాను మరిన్ని మ్యాచ్‌లు ఆడేవాడినని తెలిపాడు. ఆ సమయంలో అనిల్ కుంబ్లే భారత జట్టుకు హెడ్ కోచ్‌గా ఉండగా, విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఉన్నారు. గాయంతో జట్టుకు దూరమైన సమయంలో.. పూర్తిగా కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన తర్వాత నీకు మళ్లీ జట్టులో ఛాన్స్ కల్పిస్తామని కోహ్లీ, కుంబ్లే తనకు భరోసా ఇచ్చినట్లు మిశ్రా గుర్తు చేసుకున్నారు.

**ఫోన్ చేసినా, మెసేజ్ పంపినా నో రెస్పాన్స్:**

గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత తన రీ-ఎంట్రీ గురించి విరాట్ కోహ్లీని సంప్రదించిన ప్రయత్నాలు విఫలమయ్యాయని అమిత్ మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా ఫిట్‌గా మారిన తర్వాత నేను కోహ్లీకి ఫోన్ చేశాను.. వారం నుంచి 10 రోజుల్లోగా సమాచారం ఇస్తానని కింగ్ కోహ్లీ నాతో చెప్పాడు. కానీ వారం, రెండు, మూడు వారాలు గడిచినా అతని నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నాడు. తాను ఎన్నిసార్లు ఫోన్ చేసినా కోహ్లీ ఎత్తలేదని, మెసేజ్‌లు పంపినా రిప్లై ఇవ్వలేదని ఆరోపించాడు. దీంతో తన అంతర్జాతీయ కెరీర్ ఎలాంటి క్లారిటీ లేకుండానే ముగిసిపోయిందని మిశ్రా వాపోయాడు.

**చేదు జ్ఞాపకంగా మిగిలిన మిశ్రా కెరీర్:**

భారత్ తరఫున టెస్టులు, వన్డేలు, టీ20ల మూడూ ఫార్మాట్లలోనూ రాణించి ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించిన అమిత్ మిశ్రా.. అనుకోని పరిణామాలతో జాతీయ జట్టుకు దూరమయ్యారు. అప్పట్లో కెప్టెన్, కోచ్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో తనను మానసికంగా బాధించిందని ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



మా సికిందర్ యొక్క తాజా చీర ఫోటోషూట్

# బాహుబలిని మించిన సినిమా మళ్లీ ఆయనే ప్రకటించాలా?



భారతీయ చలనచిత్ర పరిశ్రమని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఏకైక పేరు ఎస్.ఎస్. రాజమౌళి. -బాహుబలి- చిత్రంతో టాలీవుడ్ స్థాయిని గ్లోబల్ మార్కెట్‌కు పరిచయం చేసి అటుపై -ఆర్ఆర్ఆర్- తో ఆస్కార్ అవార్డును సాధించి ఇండియన్ సినిమా చరిత్రను తిరగరాశారు జక్కన్న. అయితే -బాహుబలి- వచ్చి దశాబ్దం గడిచినా? ఇప్పటికీ ఆ రేంజ్ భారీ బడ్జెట్, విజువల్ వండర్ అనౌన్స్‌మెంట్ చేయడానికి మరే ఇతర దర్శకుడు .. నిర్మాత ముందుకు రాలేకపోతున్నారు. ఇండస్ట్రీ వర్గాల్లోనూ ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. -బాహుబలి- సృష్టించిన సునామీ ఎలాంటిదో అందరికీ తెలిసిందే. బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడమే కాకుండా ఇండియన్ మేకర్స్‌కు గ్లోబల్ ఆశలను పరిచయం చేసింది ఆ సినిమానే. అటుపై పలువురు ప్రముఖ దర్శకులు, బడా నిర్మాతలు పాన్-ఇండియా రేంజ్‌లో భారీ చిత్రాలను ప్రకటించినా? బాహుబలి రేంజ్ మేజిక్‌ను, ఆ స్థాయిలో అంచనాలను క్రియేట్ చేయడంలో ఎక్కడికక్కడ తడబడుతున్నారు. బాహుబలిని మించిన సినిమా ..ఆ స్థాయి ప్రకటన మళ్లీ రాజమౌళి మాత్రమే చేయగలరని.. మిగతా వారంతా ఆ సాహసం చేసేందుకు వెనకడుగు వేస్తున్నారని స్వయంగా పలువురు ప్రముఖ నిర్మాతలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు.దీనికి ప్రధాన కారణం రాజమౌళికున్న అంకితభావం, రిస్క్ తీసుకునే తత్వమే. ఒక సినిమా కోసం సంవత్సరాల తరబడి శ్రమించడం, ప్రతీ ఫ్రేమ్‌ను ఎంతో పకడ్బందీగా చెక్కడం జక్కన్న శైలి. వందల కోట్ల బడ్జెట్, భారీ విజువల్ ఎఫెక్ట్స్ దానికి తగిన బలమైన ఎమోషన్స్ ఈ మూడింటిని బ్యాలెన్స్ చేస్తూ ఆడియన్స్‌ను థియేటర్లలో కట్టిపడేసే దమ్ము రాజమౌళికే ఉందని టాలీవుడ్ మేకర్స్ నమ్ముతున్నారు. సాధారణంగా ఒక ఫ్లాప్ వస్తే కుంగిపోయే పరిశ్రమలో విజయాల తర్వాత కూడా అదే కసిని కొనసాగించడం రాజమౌళికే చెల్లింది.ప్రస్తుతం రాజమౌళి మహేశ్ తో ఓ గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. రాజమౌళి-మహేశ్ కాంబినేషన్ అనగానే ఇండస్ట్రీలో అంచనాలు తారాస్థాయికి చేరాయి. హాలీవుడ్ రేంజ్‌లో ఇండియానా జోన్స్ తరహా యాక్షన్ అడ్వెంచర్‌గా రాబోతున్న ఈ సినిమాపైనే అందరి కళ్లు ఉన్నాయి. -బాహుబలి-, -ఆర్ఆర్ఆర్- రికార్డులను ఈ సినిమా ఏ మేరకు తిరగరాస్తుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. సినిమా తీయడమే కాకుండా దాన్ని మార్కెట్ చేసే విధానంలో రాజమౌళి వేసే ప్రతి అడుగు ఒక పాఠం లాంటిది.ఇతర దర్శకులు ..నిర్మాతలు బాహుబలి రేంజ్ ప్రాజెక్ట్‌లను ప్రకటించకపోవడానికి ఫైనాన్షియల్ రిస్క్ కూడా ఓ కారణం. వందల కోట్లు పెట్టుబడి పెట్టి.. ప్రతి ఒక్కరినీ మెప్పించేలా స్క్రిప్ట్ సిద్ధం చేయడం చిన్న విషయం కాదు. ఒక్క తప్పు జరిగినా భారీ నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో నిర్మాతలు సైతం కొత్త ప్రయోగాలు చేయడానికి జంకుతున్నారు. కానీ రాజమౌళి మాత్రం ఆ రిస్క్‌ను తన భుజాన వేసుకుని బాక్సాఫీస్ వద్ద సరికొత్త బెంచ్ మార్క్‌లను క్రియేట్ చేస్తూ వస్తున్నారు.అందుకే -బాహుబలి-ని మించిన సినిమా ఎప్పుడు వస్తుంది? అంటే దానికి ఒకే ఒక్క సమాధానం రాజమౌళి నుంచి వచ్చే తదుపరి ప్రకటన మాత్రమే. ఇండస్ట్రీలో ఎంతమంది కొత్త దర్శకులు వచ్చినా?ఎంత టెక్నాలజీ మారినా? బాక్సాఫీస్‌ను షేక్ చేసే ఆ పవర్‌ఫుల్ అనౌన్స్‌మెంట్ చేసే సత్తా ఒక్క రాజమౌళికే ఉందని మరోసారి రుజువు అవుతోంది. జక్కన్న నుంచి రాబోయే గ్లోబల్ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమా బాటను ఎలా మారుస్తుందో చూడాలి.



రష్మిక మందన్న రీగల్ బ్లూ కోచర్ లుక్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com